శుక్రవారం
12-08-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 52
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

టమాట రైతులకు మిగిలింది
కన్నీరే!

అనంతపురం మార్కెట్‌లో కిలో రూ.2

- రవాణా ఖర్చులు కూడా రాని వైనం
- వ్యాపారుల మాయాజాలం
- పంట రోడ్లపై పారబోసి... సాగుదారుల నిరసన
- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్

విశాలాంధ్రబ్యూరో-అనంతపురం: ఒక పక్క మార్కెట్ లో మిర్చి ధర ఘాటెక్కింది... పత్తి ధర కూడా పైపైకిపోతోంది. అయితే ప్రజలంతా నిత్యం వినియోగించే టమాట మాత్రం రైతులకు కన్నీళ్లు తెప్పిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అనేక మండలాల్లో ఈసారి ఎక్కువ విస్తీర్ణంలో టమాట పంట సాగు చేయగా దిగుబడి కూడా అమాంతం పెరిగింది. అయితే ధర మాత్రం పాతాళానికి పడిపోయింది. మార్కెట్‌లో టమాట ధర కిలో రెండు రూపాయలే పలకడంతో అవాక్కయిన రైతులు...రోడ్ల వెంబడి పారబోసి, పశువులకు మేతగా వేసి నిరసన వ్యక్తం చేస్తున్నారు. వందల టన్నుల టమాటాలను రైతులు మార్కెట్టు దగ్గర కుప్పలుగా పోశారు. రవాణా ఖర్చు విపరీతంగా పెరగడంతో దూర ప్రాంతాలల్లోని మార్కెట్‌కు సరుకు తరలించలేక పోతున్నారు. కంబదూరు మండలం నుండి రెండు మినీ ట్రక్కుల్లో హైదరాబాద్ మార్కెట్‌కు

- మిగతా 2 లో

జగన్ సర్కార్‌కు
సుప్రీం నోటీసులు

బకాయిలపై కోర్టును ఆశ్రయించిన నార్మన్ ఫోస్టర్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను ఇప్పించాలంటూ అమరావతి రాజధాని నిర్మాణానికి అవసరమైన డిజైన్లు రూపొందించిన నార్మన్ ఫోస్టర్ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు గురువారం ఆర్బిట్రేషన్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు అమరావతి మెట్రోపాలిటన్ రీజియన్ అభివృద్ధి అథారిటీ (ఏఎంఆర్‌డీఏ)కి నోటీసులు జారీ చేసింది. ఫోస్టర్ సంస్థ పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ఆదేశించింది. అమరావతి రాజధాని నిర్మాణం కోసం ఫోస్టర్ సంస్థ రాజధాని నిర్మాణ ప్రణాళిక, భవన ఆకృతులు రూపొందించింది. అయితే తమకు రావాల్సిన సొమ్ము మాత్రం చెల్లించడం లేదని పేర్కొంది. తమకు రావల్సిన బకాయిలపై ఏఎంఆర్‌డీఏకి లేఖలు, నోటీసులు పంపినా సమాధానం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. 2019 జూన్ తర్వాత

- మిగతా 2 లో

విద్యతోనే మెరుగైన జీవితం

- సీఎం వైఎస్ జగన్
- 3వ విడత 'విద్యా దీవెన' నిధుల విడుదల

8 లో

అమలు కాని...
విద్యాహక్కు

- తల్లిదండ్రులకు అవగాహన ఏదీ?
- ప్రచారంలో అధికారుల నిర్లక్ష్యం
- బడిఈడు పిల్లల గుర్తింపు జాప్యం
- ఇప్పటికే ఎల్‌కేజీ, యూకేజీలో చేరిన పిల్లలు
- ఒకటో తరగతికి షెడ్యూలు జారీ
- ప్రైవేట్ యాజమాన్యం చోద్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం(ఆర్‌టీఈ) కింద ఒకటో తరగతి ప్రవేశాలకు చిక్కులు ఎదురవుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమైన నెల రోజుల తర్వాత, తల్లిదండ్రులకు ఎలాంటి అవగాహన కల్పించకుండా ప్రభుత్వం హడావుడీగా కంటితుడుపు చర్యలను ప్రారంభించిందనే విమర్శలున్నాయి. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1) (సీ) అనుసరించి ఈ విద్యా సంవత్సరం (2022-23) అన్ని కార్పొరేట్, ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాల అమలుకు ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 16వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో ప్రవేశాలకు షెడ్యూలు జారీ చేసినప్పటికీ, ఈ చట్టంపైన విద్యార్థుల తల్లిదండ్రులకు ఎలాంటి అవగాహన కల్పించనందున, చాలా మంది ఆసక్తి చూపడం లేదు. డీఈవోలు, డీవైఈవోలు సైతం చట్టం విధివిధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేదు. బడుగుల పిల్లలకు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి విద్యనందించడం ఈ చట్టం ప్రధాన లక్ష్యం. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాలకు చెందిన విద్యార్థులు (అనగా అనాథ పిల్లలు, హెచ్ఐవి బాధితుల పిల్లలు, దివ్యాంగులు) కోసం 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాలకు (బీసీ, మైనార్టీ, ఓసీ) చెందిన పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించనుంది. కార్పొరేట్, ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అర్హత కలిగిన పిల్లలకు ఒకటో తరగతి విద్యార్థుల నమోదులో 25 శాతం సీట్లు కేటాయించి ఫీజు రీయింబర్స్‌మెంట్ పద్ధతిన 2022-23 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వార్షిక ఆదాయం రూ.లక్షా 20 వేలు, పట్టణ ప్రాంతంలో నివసించే బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వార్షికాదాయం రూ.లక్షా 40 వేల ప్రాతిపదికగా తీసుకుని, వారి కుటుంబాల పిల్లలు అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి ఈ విద్యా సంవత్సరానికిగాను ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం, 2009లో 12(1)(సీ) అమలులో భాగంగా సవరణ ఉత్తర్వులు జారీ చేసింది.

16 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం, 2009లో 12 (1)(సీ) అమలుకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఈనెల 16 నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తు చేసేందుకుగాను పాఠశాల విద్యాశాఖ పూర్తి వివరాలను ఎంవ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈనెల 30న లాటరీ పద్ధతిలో మొదటి జాబితాను ఎంపిక చేస్తారు. మొదటి జాబితాలో మిగిలిన సీట్లను సెప్టెంబరు 2న రెండో జాబితాలో వెల్లడిస్తారు. విద్యార్థులకు

- మిగతా 2 లో

కంపెనీలు వేరైనా
మందు ఒక్కటే!

జనరిక్ దుకాణాల్లో లభ్యమయ్యే మందులు, పేరు గడించిన షాపుల్లో లభించేవి ఒకే విధంగా పనిచేస్తాయి. కంపెనీ వేరైనా వాటిలో ఉండే మందు ఒక్కటే. అదే ఫార్ములాతో అనేక కంపెనీలు ఒకేరకమైన మందు తయారుచేసి అమ్ముకుంటాయి. డెవలపర్ పేటెంట్ రక్షణ గడువు ముగిసిన తర్వాత సాధారణ ఉత్పత్తులుగా అందుబాటులోకి వస్తాయి. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే... ధరలు. ఇది కంపెనీల మాయాజాలమేననీ, ప్రభుత్వాలు నియంత్రణ అధికారం కలిగి ఉండాలని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

- తక్కువ ధరకే 'జనరిక్' మందులు
- 'పేటెంట్' ముగియగానే సాధారణ ఉత్పత్తిగా మార్పు
- గుణము, పని విధానమూ ఒక్కటే

2 లో

అవే మందులు...

జనరిక్ మందులు నాణ్యమైనవే. సాధారణ మందుల దుకాణాలకైనా, జనరిక్ షాపులకైనా కంపెనీలు అవే మందులు సరఫరా చేస్తాయి. నాణ్యతలో గానీ, మందు పనిచేసే విధానంలో గానీ ఎక్కడా తేడా ఉండదు.

అనిల్ కుమార్, డైరెక్టర్-డ్రగ్ కంట్రోల్

ఎస్పీ ఫకీరప్పకు
గోల్డ్‌మెడల్ ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఎద్దేవా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎంపీ గోరంట్ల మాధవ్ న్యూడ్ వీడియో వ్యవహారంపై 'కొండను తవ్వి ఎలుకనుపట్టిన చందంగా వ్యవహరించిన అనంతపురం జిల్లా ఎస్పీ ఫకీరప్పకు గోల్డ్ మెడల్ ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఎంపీ గోరంట్ల మాధవ్ 'న్యూడ్ వీడియో' వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో దేశ వ్యాప్తంగా చర్చ జరిగిందన్నారు. పార్లమెంట్‌లో సైతం ఆంధ్రప్రదేశ్ పరువు మంటగలిపే విధంగా ఆ వీడియో వైరల్ అయ్యిందని, దీనిపై వెంటనే స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆ వీడియోను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని, ఫోరెన్సిక్ నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని

- మిగతా 2 లో

సైనిక క్యాంపుపై ఆత్మాహుతి దాడి

- ముగ్గురు సైనికుల వీరమరణం
- ఇద్దరు ముష్కరుల హతం
- స్వాతంత్ర్య వేడుకల వేళ
- రాజౌరి జిల్లా పర్ఘల్‌లో ఘటన

జమ్ము : భారతదేశం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సిద్ధమవుతున్న వేళ... జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. గురువారం తెల్లవారుజామున రాజౌరీకి 25 కి.మీల దూరంలోని సైనిక క్యాంపుపై ఇద్దరు ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు అమరులయ్యారు. నాలుగు గంటలపాటు జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ముష్కరులు హతమయ్యారు. 'గురువారం తెల్లవారుజామున, రాజౌరీ జిల్లాలోని పర్ఘల్‌లోని భారత సైనిక పోస్ట్‌లోని అప్రమత్తమైన సెంట్రీలు ప్రతికూల వాతావరణం, దట్టమైన ఆకులను ఉపయోగించుకుని అనుమానాస్పద వ్యక్తులు తమ పోస్ట్‌ను సమీపిస్తున్నట్లు గుర్తించారు' అని జమ్ము పీఆర్‌వో (రక్షణ) లెఫ్టినెంట్ కల్నల్ దేవేందర్ ఆనంద్ తెలిపారు. గ్రెనేడ్లను విసిరిన ఇద్దరు ఉగ్రవాదులను సెంట్రీలు సవాలు చేశారని ఆయన చెప్పారు. అయితే ఆ ఇద్దరు ఉగ్రవాదులు పోస్ట్‌లోకి చొరబడేందుకు యత్నించారు. భారీ కాల్పులకు దిగారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వారిపై కాల్పులు జరిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులను సైన్యం

- మిగతా 2 లో



కృష్ణా, గోదావరి నదులకు
వరద ఉధృతి

- శ్రీశైలం నుంచి విజయవాడ వరకు అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత
- ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- లంక గ్రామాలను చుట్టుముట్టిన నీరు
- తీరప్రాంతాలను అప్రమత్తం చేసిన అధికారులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. రాష్ట్రంలోని అత్యంత కీలకమైన శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు వరద ఉధృతితో నిండుకుండలను తలపిస్తున్నాయి. శ్రీశైలం జలాశయానికి సుమారు 5లక్షల పైచిలుకు వరద కొనసాగుతోంది. దీంతో శ్రీశైలం 10 గేట్లు 12 అడుగుల మేర ఎత్తి దిగువకు వరద నీటి మొత్తాన్ని విడుదల చేస్తుండగా, నాగార్జున సాగర్‌లో సైతం మొత్తం 26 గేట్లు ఎత్తి, ఎగువ నుంచి వచ్చే వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 884.60 అడుగుల నీటిమట్టాన్ని కొనసాగిస్తూ, మిగిలిన నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 588 అడుగులకు చేరడంతో ప్రాజెక్ట్ అధికారులు 3,36,672 లక్షల క్యూసెక్కుల నీటిని

- మిగతా 2 లో

ఇదీ లోకం!

గాంధీ గారి బొమ్మండయ్యా !

ప్రజాస్వామ్యానికి పాతర...!

జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలపై కేంద్రం నాన్చుడు ధోరణి

2023 మార్చిలోపు జరిగే పరిస్థితి లేదు

శ్రీనగర్ : జమ్ముకశ్మీర్‌లో 2018, జూన్ నుంచి ఎన్నికైన ప్రభుత్వం లేదు. ఎన్నికల తేదీలను ప్రకటించడానికి ముందు తప్పనిసరి ప్రక్రియ అయిన ఓటర్ల తుది జాబితా ప్రచురణలో భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) తీవ్ర జాప్యం చేస్తోంది. జమ్ముకశ్మీర్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేపదే ప్రకటనలు చేసినప్పటికీ ఈ ఏడాదీ అది జరిగేలా లేదు. మెహబూబా ముఫ్తీ ప్రభుత్వానికి బీజేపీ మద్దతును ఉపసంహరించుకున్న తర్వాత జమ్ముకశ్మీర్‌లో ఎన్నికైన ప్రభుత్వం లేకుండా పోయింది. జమ్ముకశ్మీర్ ఓటర్ల జాబితా ప్రచురణ తేదీని నవంబరు 25కు మార్చినట్లు ఈ నెల 8న ఈసీఐ ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఇది అక్టోబరు 31 నాటికి పూర్తి అయితే నవంబరు-డిసెంబరు నెలల్లో ఎన్నికలు నిర్వహించే వీలు ఉంటుందని తొలుత భావించారు. అసెంబ్లీ ఎన్నికలను



సెప్టెంబరు- డిసెంబరు మధ్యకాలంలో 1983 నుంచి (1987లో మినహా) నిర్వహిస్తూ వచ్చారు. ఇప్పుడు నవంబరు 25వ తేదీని ఓటర్ల జాబితా ప్రచురణ తేదీగా ఖరారుచేసిన క్రమంలో ఈ ఏడాది కాదు కదా వచ్చే ఏడాది మార్చి లోపు అసెంబ్లీ ఎన్నికలు జరిగే పరిస్థితి లేదు. శీతాకాలంలో హిమపాతం కారణంగా కశ్మీర్‌లోని

- మిగతా 2 లో

చైనాలో కొత్త వైరస్

35 మందిలో గుర్తింపు..

బీజింగ్ : చైనాలో లంగ్యా హెనిపా అనే కొత్త వైరస్‌ను గుర్తించారు. తూర్పు చైనాలోని హెనాన్, షాన్‌డాంగ్ ప్రావిన్స్‌ల్లో ఇప్పటి వరకూ 35 మంది ఈ వైరస్ బారిన పడ్డారు. ఇది జంతువుల నుంచి మనుషులకు వ్యాప్తి చెందుతుందని, జ్వరంతో బాధపడుతున్న పేషెంట్ల గొంతు నుంచి సేకరించిన నమూనాల్లో లంగ్యా వైరస్‌ను గుర్తించినట్లు చైనా అధికారిక మీడియా ప్రకటించింది. ఈ వైరస్ బారినపడిన వారిలో ఫ్లూ లాంటి లక్షణాలను గుర్తించారు. లంగ్యా వైరస్‌కు వాక్సిన్ లేదు. లంగ్యా వైరస్‌ను మొదటిసారిగా 2019లో మనుషుల్లో గుర్తించారు. కానీ ఈ వైరస్ కేసులు ఎక్కువగా ఈ ఏడాదే నమోదవుతున్నాయి. ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందా లేదా అనే విషయాన్ని తెలుసుకోవడానికి చైనీస్ నిపుణులు యత్నిస్తున్నారు. కరోనా ప్రభావం కనిపించిన 2020 జనవరి-జులై నెలల మధ్యలో లంగ్యా వైరస్ ఇన్ఫెక్షన్లు కనిపించలేదని బీజింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైక్రోబయాలజీ అండ్ ఎపిడెమియాలజీ పరిశోధకులు వెల్లడించారు. అయితే జులై తర్వాత 11 లంగ్యా వైరస్ కేసులను గుర్తించారు. ఈ వైరస్ బారిన పడిన వారిలో ఎక్కువ మంది జ్వరంతో బాధపడ్డారు. 50 శాతం రోగులలో దగ్గు, 54 శాతం మందిలో అలసట, ఆకలి లేకపోవడం, 46 శాతం మందిలో కండరాల నొప్పులు, 38 శాతం మందిలో వాంతి వచ్చినట్లు ఉండటం లాంటి లక్షణాలను గుర్తించారు. హెనాన్, షాన్‌డాంగ్ ప్రావిన్సుల్లోని ఎలుకల్లా ఉండే 262 ష్రూస్ అనే క్షీరదాలను పరీక్షించగా 71 ష్రూస్‌ల్లో ఈ వైరస్‌ను చైనా పరిశోధకులు గుర్తించారు. కుక్కలు, మేకల్లోనూ ఈ వైరస్‌ను గుర్తించారు. లంగ్యా వైరస్ కూడా గబ్బిలాల్లో కనిపించే ప్రమాదకర నిఫా వైరస్ కుటుంబానికి చెందినదిగా తెలుస్తోంది. నిఫా వైరస్ కోవిడ్ తరహాలోనే వ్యాప్తి చెందుతుంది. ఇది మరో కరోనా ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది.

తాలిబన్ల ఏడాది పాలన అస్తవ్యస్తం..

విశాలాంధ్ర ప్రపంచం

- తినడానికి తిండిలేదు... రోగాలకు చికిత్స లేదు...
- అఫ్ఘాన్‌లో మానవతా సంక్షోభం : ఐరాస ఆందోళన

కాబూల్ : అఫ్ఘనిస్తాన్ దేశంలో మానవతా సంక్షోభం నెలకొందని ఐక్య రాజ్య సమితి (ఐరాస) ఆందోళన వ్యక్తంచేసింది. తాలిబన్ల పాలనలో అఫ్ఘన్ ప్రజలు అల్లాడిపోతున్నారని, వారికి తినడానికి తిండి లేదని, రోగులకు చికిత్స అందడం లేదని దాంతో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొంది. స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్యం లేక ప్రజలకు కలరా సోకుతోంది. దక్షిణ అఫ్ఘాన్‌లోని ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడాయి. కొన్ని ఆసుపత్రుల్లో రోగులను చేర్చుకోలేని దుస్థితి ఉంది. హెల్మండ్ ప్రావిన్స్‌లోని ముసా కాలా జిల్లా ఆసుపత్రిలో కలరా రోగులు మినహా ఇతర వ్యాధిగ్రస్తులనుర చేర్చుకోవడం లేదు. ఎమర్జెన్సీ వార్డులన్నీ కలరా రోగులతో నిండిపోయాయి. వాడిన సూదులే వాడుతున్నారు. తుప్పు పట్టిన బల్లలపై రోగులు పడుకునే దుస్థితి నెలకొంది. దీంతో అఫ్ఘాన్‌లో మానవతా సంక్షోభాన్ని ప్రపంచంలోనే అత్యంత దారుణమైనదిగా ఐక్యరాజ్యసమితి పేర్కొంది. దక్షిణ దేశంలో పేదరికం పెరిగిందన్నది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం తర్వాత ద్రవ్యోల్బణం పెరిగి కరువు తాండవిస్తోంది. తమ దేశం తాలిబన్ల వశమైనప్పటి నుంచి వంట నూనె కూడా దొరకని పరిస్థితులు దేశంలో ఉన్నాయి.

పోషకాహార లోపంతో ఎంతో మంది చిన్నారులు బాధపడుతున్నారు. ఆసుపత్రుల్లోని చిన్న వార్డులో ఒక్కో బెడ్‌పై ఇద్దరు చికిత్స పొందుతుండటం దయనీయం. తినడానికి రొట్టే కూడా దొరకడం లేదంటూ ఓ తల్లి వాపోయింది. ఛార్జీలకు డబ్బులు లేక కనీసం తమ పిల్లలను చాలామంది ఆసుపత్రులకు తీసుకురాలేకపోతున్నారని.. ఎంతో మంది ఇళ్ల వద్ద ప్రాణాలు కోల్పోతున్నారని అఫ్ఘనిస్తాన్ వైద్యులే ప్రకటించడం అక్కడి భయానక పరిస్థితులను తెలియజేస్తున్నాయి.

కరోనా సమయంలో కిమ్‌కు తీవ్ర అనారోగ్యం
సోదరి సంచలన ప్రకటన



ప్యాంగ్యాంగ్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ కోవిడ్ వ్యాప్తి సమయంలో తీవ్ర అనారోగ్యానికి గురైనట్లు ఆయన సోదరి కిమో యో జాంగ్ వెల్లడించారు. కొన్నాళ్లుగా కిమ్ ఆరోగ్యం గురించి ఊహాగానాలు, కథనాలు వెలువడుతుండగా ఆయన సోదరే స్వయంగా ఈ విషయం వెల్లడించడం గమనార్హం. ప్రజల ఆరోగ్యం గురించీ ఆందోళనల చెందిన కారణంగా తన సోదరుడు ఒక్క క్షణం నిద్రపోలేదన్నారు. కిమ్ కరోనా బారినపడినది ఎప్పుడన్నది మాత్రం ఆమె వెల్లడించలేదు. అదే సమయంలో వైరస్ వ్యాప్తి విషయంలో కరపత్రాలను ముద్రించి తప్పుడు ప్రచారం చేస్తున్న దక్షిణ కొరియా అధికారులను నాశనం చేస్తామని, దీనికి తగిన మూల్యం చెల్లించుకుంటారని ఆమె ప్రతిజ్ఞ చేశారు. ఉత్తరకొరియాలో ఇటీవలి కోవిడ్ వ్యాప్తికి కారణాలపై సందేహాస్పదమైన వాదనలతో కూడిన కరపత్రాలను పదే పదే 'దక్షిణ కొరియా తోలుబొమ్మలు' బెలూన్ల ద్వారా సరిహద్దుల్లోకి పంపుతున్నాయని జాంగ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) వెల్లడించింది.

టమాట రైతులకు మిగిలింది కన్నీరే!

(మొదటిపేజీ తరువాయి)

టమాటాలను పంపితే...బండి బాడుగ రూ.18000 అయిందని, సరుకు కొన్నవారు రూ.12000 ఇచ్చి పంపారని రైతులు చెబుతున్నారు. గత మూడేళ్ల నుంచి ధరల స్థిరీకరణ అనేది లేదు, రెండు సంవత్సరాలుగా వ్యవసాయ పనులు రెట్టింపు అయ్యాయి. గతంలో టమాటా నారు వంద మొక్కలకు రూ.60 ఉండగా ఇప్పుడు రూ.100. గతంలో దుక్కి చేయడానికి, గట్లు చేయడానికి ఎకరాకు రూ.1200 వ్యయం వచ్చేది. ఇప్పుడు రూ.3వేలు. రవాణా, టోల్ చార్జీలు, కూలీల రేట్లు విపరీతంగా పెరిగాయి. ఏ పంట ఎక్కడెక్కడ పండిస్తున్నారో తెలిపే నాథుడే లేడు. వ్యవసాయ అధికారులు గణాంకాలు పూర్తిగా మరచి పోయారు. వ్యవసాయం జూదంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రాప్తాడు, కల్యాణదుర్గం, కంబదూరు, ఆత్మకూరు, బత్తలపల్లె మండలాలతో పాటు పక్కనే ఉన్న కూడేరు, గార్లదిన్నె, సింగనమల, కదిరి, హిందూపురం ప్రాంతంలోని గ్రామాల్లో చాలా మంది రైతులు టమాటాను సాగు చేస్తున్నారు. నిత్యం టమాట, పచ్చిమిర్చిని వేకువ జామున చిన్న వాహనాల్లో అనంతపురం బహిరంగ మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. అయితే టమాటాకు వస్తున్న ధర రైతులకు ఏమాత్రం గిట్టుబాటు లేక రైతులు లబోదిబోమంటున్నా పట్టించుకొనే దిక్కేలేదు. దీంతో టమాటా రైతుల బాధలను గుర్తించిన సీపీఐ, టీడీపీ నాయకులు టమాటా మార్కెట్ల వద్ద నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. టమాటా రైతులను ఆదుకోవాలని, ధరలు పడిపోకుండా చూడాలని సీపీఐ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం కూడా టమాట పెద్ద మొత్తంలో మార్కెట్ కు రావడంతో వ్యాపారులు సిండికేట్‌గా మారిపోయారు. దీంతో టమాట ధర ఒకే సారి కిలో రెండు రూపాయలకు పడిపోయింది. 35 కిలోల క్యారెట్ ధర 80 నుంచి 100 రూపాయల వరకు పలికింది. నిన్న, మొన్నటి వరకు క్యారెట్ ధర రూ.200 నుంచి రూ.300 పలకగా, ఏకంగా సగానికి పైగా ధర తగ్గించేశారని క్యారెట్ రైతులు సైతం దిగాలు పడుతున్నారు. పంటకు పెట్టిన పెట్టుబడులు, రవాణా చార్జీలు కూడా రాని పరిస్థితి రావడంతో రైతులు... వ్యాపారులకు అమ్మే బదులు రోడ్డుపై పారబోసి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో కష్టాలు పడి టమాటా సాగు చేస్తే మార్కెట్లో వ్యాపారులు మాయజాలం ప్రదర్శించడం సరికాదని వాపోతున్నారు. రైతు నిర్ణయించాల్సిన ధరను వ్యాపారులు నిర్ణయం తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తాం అని చెప్పిన రాజకీయ పెద్దలు, ప్రభుత్వాలు రైతుల సంక్షేమం గురించి పట్టించుకోకుండా ఆజాదికా అమృత్ మహోత్సవాల పేరుతో సంబరాలు జరుపుకుంటున్నారంటూ ప్రభుత్వ తీరుపై టమాటా రైతులు మండిపడుతున్నారు.

జగన్ సర్కార్‌కు సుప్రీం నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి బకాయిలపై అనేకసార్లు లేఖలు రాసినట్లు వెల్లడించింది. ఎన్ని విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపింది. తమకు రావాల్సిన నిధులను మధ్యవర్తిత్వం ద్వారా ఇప్పించాలని సుప్రీంకోర్టును ఫోస్టర్ సంస్థ కోరింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఏఎంఆర్‌డీఏకి నోటీసులు జారీచేసింది.

ఎస్పీ ఫకీరప్పకు గోల్డ్‌మెడల్ ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారని గుర్తుచేశారు. ఎంపీ గోరంట్ల అది మార్ఫింగ్ వీడియో అని, పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారన్నారు. అనంతరం రాష్ట్ర హోంశాఖ మంత్రి కూడా ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక ప్రకారం చర్యలుంటాయని ప్రకటించారు. ఈనెల 10వ తేదీన హఠాత్తుగా అనంతపురం జిల్లా ఎస్పీ ఫకీరప్ప ఒరిజినల్ వీడియో లేదని, ఆ వీడియో ఫేక్ లేదా ఎడిటెడ్ అని మాట్లాడాన్ని ఆ ప్రకటనలో తప్పుపట్టారు. గోరంట్ల తాను ఫిర్యాదు చేశానని చెబుతుండగా, ఎస్పీ మాత్రం ఎవ్వరూ ఫిర్యాదు చేయలేదని దాట వేయడం తగదన్నారు. హోంమంత్రి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని చెబుతుండగా, ఎస్పీ అసలు వీడియో లేదని చెబుతున్నారని పేర్కొన్నారు. అసలు ఎంపీ గోరంట్ల వీడియో ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపకుండా, ఎస్పీ పకీరప్ప అది ఫేక్ అని ఏ విధంగా నిర్ధారిస్తారని ప్రశ్నించారు. వాస్తవాలను కనిపెట్టకుండా నోటి ప్రకటనలు చేసిన ఎస్పీ పకీరప్పకు గోల్డ్‌మెడల్ ఇవ్వాలని, లోక్‌సభ స్పీకర్ దృష్టికి కూడా వెళ్లిన వీడియో వ్యవహారంపై అనంతపురం జిల్లా ఎస్పీ స్పందించిన తీరు సరికాదన్నారు. దీనిపై సీఎం జగన్ ఇప్పటికైనా ఆ వీడియో వ్యవహారంపై స్పందించాలని, నిజానిజాల నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. అందుకు కారకులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

అనంతపురం ఎస్పీ తపన, ఆరాటం హాస్యాస్పదం: వర్ల రామయ్య

ఎంపీ గోరంట్ల మాధవ్‌ను బూతు భాగోతం నుంచి రక్షించేందుకు అనంతపురం జిల్లా పోలీసు అధికారి ఫక్కీరప్ప పడిన తపన, ఆరాటం, ఆతృత హాస్యాస్పదమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక ఎంపీగా తాను చేయకూడని పని చేశారనీ, మసిపూసి మారేడుకాయ చేయాలని చూశారని విమర్శించారు. గోరంట్ల మాధవ్ తీరును రెండు రాష్ట్రాలు దుమ్మెత్తిపోస్తున్నాయని, ఎస్పీ ఫకీరప్ప తమకు ఎవరూ గోరంట్లపై ఫిర్యాదు చేయలేదనడమేంటని విమర్శించారు. పార్లమెంట్ సైతం ఎంపీ మాధవ్ విషయాన్ని సీరియస్‌గా పరిగణించాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్యానికి పాతర...!

(మొదటిపేజీ తరువాయి)

కొన్ని ప్రాంతాలు, చీనబ్ లోయ గడ్డకడతాయి.దాంతో ఎన్నికల నిర్వహణ వీలు పడదు. 2023లో ఎన్నికలు నిర్వహించడం వల్ల బీజేపీపై ప్రభావం తక్కువ ఏమీ కాదు. అసెంబ్లీ ఎన్నిక ఫలితాలు ప్రతికూలంగా వస్తే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కమలం దళానికి గట్టి ఎదురుదెబ్బ తప్పబోదు. ఒకవేళ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించకుండానే సార్వత్రిక ఎన్నికలను చేపట్టినట్లయితే అది కేంద్రప్రభుత్వ వైఫల్యమే అవుతుంది. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ ముగిసిన తర్వాత అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్రం చెబుతూ వచ్చింది.

2022లో జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించే ఆలోచన కేంద్రానికి లేదని ఓటర్ల జాబితా ప్రచురణలో జాప్యం ద్వారా తెలుస్తోందని అనంతనాగ్ ఎంపీ, రిటైర్డ్ జడ్జి జస్టిస్ హస్నేయిన్ మసూదీ వ్యాఖ్యానించారు. 'ఎన్నికైన ప్రభుత్వానికి బ్యూరోక్రటిక్ పాలన ప్రత్యామ్నాయం కాదని, ఎన్నికైన ప్రభుత్వానికి ప్రజల పట్ల జవాబుదారీ ఉంటుంది' అని అన్నారు. నాలుగేళ్లుగా ఎన్నికైన ప్రభుత్వం లేకుండా ఉండటం దురదృష్టకరం. జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం ప్రజలు వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి దాపురించింది. ఎన్నికల నిర్వహణలో జాప్యంతో ప్రజాస్వామ్య సారం దెబ్బతింటోంది' అని జమ్మూకశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ సీనియర్ నేత, మాజీ మంత్రి సయ్య బషరత్ బుఖారీ అన్నారు. గతంలో జమ్మూకశ్మీర్‌లో 1990, జనవరి 19 నుంచి 1996, అక్టోబరు 9 వరకు అంటే ఆరేళ్ల 264 రోజులు రాష్ట్రపతి పాలనలో ఉంది. అంతకుముందు 1987, జూన్ 11 నుంచి 1992, ఫిబ్రవరి 25 వరకు అంటే నాలుగేళ్ల 259 రోజుల పాటు రాష్ట్రపతి పాలన కొనసాగింది. ఇప్పుడు నాలుగేళ్లకుపైగా బ్యూరోక్రటిక్ పరిపాలన కొనసాగుతోంది.

మోదీ హామీ ఏమైంది?

2020, ఆగస్టు 15న ఎర్రకోట సాక్షిగా జమ్మూకశ్మీర్‌లో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తి చేసి అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామన్న హామీని ప్రధాని మోదీ ఇచ్చారు. జమ్మూకశ్మీర్‌కు సొంత ముఖ్యమంత్రి, మంత్రులు ఉంటారని అన్నారు. 2021, జూన్ 24న న్యూఢిల్లీలో కశ్మీర్ నేతలతో అఖిలపక్షాన్ని నిర్వహించిన ఆయన మరోమారు అదే హామీనిచ్చారు. జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామిక మూలాల బలోపేతమే తమకు ప్రధానమని చెప్పారు. ఎన్నికలు నిర్వహించేందుకు నియోజకవర్గాల పునర్విభజనను త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ, పునర్విభజన ప్రక్రియ పూర్తి అయిన ఆరు నుంచి ఎనిమిది నెలల్లోపు ఎన్నికలను జమ్మూకశ్మీర్‌లో నిర్వహిస్తామని చెప్పారు. ఈ విషయంలో ఎటువంటి గందరగోళం లేదన్నారు. ఈ ఏడాది చివరికి జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరుగుతాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జూన్‌లో ప్రకటన చేశారు.

ఎన్నికల జాప్యంలో ఈసీఐ పాత్ర..

భద్రతా కారణాల వల్ల లోక్‌సభ ఎన్నికలతో పాటుగా జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కుదరదని చెప్పడంతో 2019, మార్చి 10 నుంచి వివిధ పార్టీల విమర్శలను ఈసీఐ ఎదుర్కొవాల్సి వచ్చింది. ఆ తర్వాత కేంద్ర పాలిత ప్రాంతంలో పరిస్థితులను సమీక్షించేందుకు ప్రత్యేక పరిశీలకులుగా ముగ్గురిని నియమించింది. జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలను ఎప్పుడు నిర్వహించవచ్చో నివేదిక ఇవ్వాలని సూచించింది. ఇందుకు మూడు వికల్పాలు (ఆప్షన్స్) ఉన్నట్లు పరిశీలకులు ఈసీఐకి తెలిపింది. అయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

కంపెనీలు వేరైనా మందు ఒక్కటే!

విశాలాంధ్ర- డిజిటల్: 'జనరిక్ మెడిసిన్'... దీనిపై కొంత అపోహ ఉన్నా... బాగా పనిచేస్తాయనే నమ్మకమూ ఉంది. ఒకే కంపెనీ, ఒకే రకమైన మందును రెండు విధాలుగా అమ్ముతున్నప్పుడు... ధర తక్కువ ఉన్నది సరిగా పనిచేయదేమోననే అనుమానం చాలామందిలో ఉంది. ఏది ఏమైనా రెండింటిలో ఉన్నది ఒక్కటే ఫార్ములా. బయటి మందుల షాపుల్లో కొన్న మందైనా... జనరిక్ షాపుల్లో కొన్నదైనా ఒకే విధంగా పనిచేస్తుంది. 'మెడిసిన్ ఒక్కటే... కాకపోతే కంపెనీ మారిందంతే' అని దుకాణదారుడు చెప్పినా వినియోగదారులకు మాత్రం భయం పోవడం లేదు. కంపెనీ ఎక్కువ సబ్సిడీ ఇస్తోంది కాబట్టి తగ్గించి అమ్ముతున్నామని చెబుతున్నా నమ్మడం లేదు. అయితే చాలామంది డాక్టర్లు జనరిక్ మందులు కూడా నిరభ్యంతరంగా వాడుకోవచ్చునని చెబుతున్నారు.

ఇంతకీ తేడా ఎందుకు...

అసలు సాధారణ మందుకూ, జనరిక్ మందుకు తేడా చూద్దాం.. జనరిక్ డ్రగ్.... ఇందులో ఉండే ఫార్ములా, కంపెనీలు ప్రమోట్ చేసే ఫార్ములానే ఉంటుంది. పనితీరులో సమాన గుణం కలిగి ఉంటుంది. జనరిక్ ఔషధం అసలైన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ గ్రేడియంట్ (ఏపీఐ)ను కలిగి ఉంటుంది. అయితే తయారీ ప్రక్రియ, ఫార్ములేషన్, రంగు, రుచి, ప్యాకింగ్‌లో తేడా ఉండవచ్చు. అవన్నీ ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉంటాయి. మోనోక్లోనల్ యాంటీబాడీస్ వంటి బయోఫార్మాస్యూటికల్స్, చిన్న అణువుల ఔషధాల నుంచి జీవశాస్త్రపరంగా విభిన్నంగా ఉన్నా బయోసిమిలర్‌లు క్రియాశీల ఔషధ పదార్థాలను కలిగి ఉంటాయి. ఇవి దాదాపు అసలైన ఉత్పత్తికి సమానంగా ఉంటాయి. కాకపోతే అసలైన ఉత్పత్తి కోసం ఉత్పత్తిదారుడికి తయారీ నుంచి మార్కెట్‌లోకి వచ్చే వరకూ అయ్యే ఖర్చులన్నీ భరించాల్సి ఉంటుంది కాబట్టి కంపెనీ నుంచి వచ్చే మందుకు ధర ఎక్కువ ఉంటుంది.

అధిక మొత్తంలో సబ్సిడీ

కంపెనీ అధిక మొత్తంలో సబ్సిడీ ఇస్తుంది. దీనికి 5 నుంచి 10 శాతం కలుపుకుని తక్కువ ధరకు అమ్మివేస్తాం. బయటి మెడికల్ షాపుల వాళ్లు నా షాపునకు వచ్చి మల్టీ విటమిన్, కాల్షియమ్ టాబ్లెట్‌లు తీసుకెళ్తారు. అక్కడ వాళ్లు ఎమ్మార్పీపై 20 శాతం తగ్గించి అమ్మేస్తారు. ఫిర్యాదులొస్తే లైసెన్స్ రద్దు చేస్తారు.

కే ప్రసాద్,
జనరిక్ షాపు యజమాని, విజయవాడ

అయితే డెవలపర్‌కు అందించబడిన పేటెంట్ రక్షణ గడువు ముగిసిన తర్వాత ప్రభుత్వ నిబంధనలు మేరకు ఈ జనరిల్ మందులు సాధారణ ఉత్పత్తులుగా అందుబాటులోకి వస్తాయి. ఏదైనా ఫార్మాస్యూటికల్ కంపెనీ తాను కనుగొన్న మెడిసన్‌కు 10 నుంచి 20 ఏళ్ల వరకు పేటెంట్ హక్కు కలిగి ఉంటుంది. రోగులపై క్లినికల్ ట్రైల్స్ అనంతరం నిర్దిష్ట లక్ష్యాలను చేరుకుంటుంది. మరో ఐదు సంవత్సరాల పాటు పేటెంట్ టర్మ్‌కు అవకాశం ఉంటుంది. వాళ్లు నిర్ధారించిన ధరకే మందుల అమ్మకాలు జరుగుతాయి. ప్రయోగాలు జరిపి మందు కనుగొంటారు గనుక ధర నిర్ణయించడంలో ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఉంటారు. అయితే ఇదంతా కంపెనీల మాయాజాలమేనని, టాబ్లెట్ తయారీకి అతి తక్కువ ఖర్చు అవుతుందన్నది బహిరంగ రహస్యమే.

అసలు ఎందుకు తక్కువ ధర

జనరిక్ మందులు తక్కువ ధరకు ఎందుకు దొరుకుతాయని చాలామందిని తొలిచేసే ప్రశ్న. పేటెంట్ కలిగిన కంపెనీలు నిర్దిష్ట కాలం ముగిసిన తరువాత ఆ ఔషధం ... యునైటెడ్ స్టేట్స్ అడాప్టెడ్ (యూఎస్ఏ) వంటి సాధారణ యాజమాన్య రహిత పేరుతో లేబుల్ చేయబడతాయి. వీటికి మార్కెటింగ్ పరిశోధన, ప్రకటనలు, ప్రయోగాల అధ్యయనాలు ఉండవు. గనుక మందుల ధరలు అతి తక్కువగా ఉంటాయి.

నియంత్రణ ఉండాలి

జనరిక్ మందులు నాణ్యమైనవే. మందుల ధరలు విపరీతంగా పెరగడం కంపెనీల మాయాజాలమే. గర్భిణీల్లో బీపీ కంట్రోల్ చేసేందుకు అతి తక్కువ ధరలో దొరికే అల్ఫాడోపా మందు వాడేవాళ్లం. దానిపై లాభాలు రావడంలేదని ఆ మందు దొరక్కుండా చేశారు. మేం మార్కెట్లో దొరికే మందులనే రాయాల్సి వస్తుంది. మాకు సప్లై చేసే మందులు జనరిక్‌వా, సాధారణ మందులా గుర్తు పట్టలేం. లేబుల్‌గాని, ఎమ్మార్పీలోగానీ ఎక్కడా తేడా ఉండదు. ఏదేమైనా డ్రగ్ కంట్రోల్ అధికారుల నియంత్రణ ఉండాలి.

దాక్టర్ పి. శైలజారాణి,
ఎంబీబీఎస్-ఎఫ్‌సీసీపీ, విజయవాడ

ఏకీకృత ధరల విధానం అమలు చేయాలి

ఒరిజినల్ ఫార్ములాలో కొద్దిపాటి మార్పులు, చేర్పులు ఉంటాయి. 3 నుంచి 5 శాతం వరకు తేడా ఉండవచ్చు. 90 శాతం నాణ్యమైనవే. పని విధానమూ బాగానే ఉంటుంది. ఏకీకృత ధరల విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తే ఎటువంటి ఇబ్బందులూ ఉండవు. అసెన్షియల్ మెడిసిన్ ధరలు ప్రభుత్వమే నిర్ధారించి ఆచరణలోకి తీసుకురావాలి.

దాక్టర్ తుమ్మల కార్తీక్, ఐఎంఏ మాజీ
కార్యదర్శి,విజయవాడ

వరద ఉధృతి

(మొదటిపేజీ తరువాయి)

దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ గరిష్ట స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతం 308 టీఎంసీలకు చేరుకుంది. రిజర్వాయర్ నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకోవడంతో ప్రాజెక్ట్ దిగువన ముంపుకు గురయ్యే గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. సాగర్‌కు దిగువన ఉన్న పులిచింతల కూడా నిండిపోవడంతో ఈ ప్రాజెక్టులోనూ అన్ని గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. వరద నీటికి జగ్గయ్యపేట మండలం ముక్త్యాలలో భవానీ ముక్తేశ్వర ఆలయం నీట మునిగింది. విజయవాడ ప్రకాశం బ్యారేజీ మొత్తం 70 గేట్లు ఎత్తి సుమారు 90 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తుండగా, శుక్రవారం ఉదయానికి వరద ఉధృతి గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అధికారులు దిగువన ఉన్న తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

గోదావరికి మళ్లీ పోటెత్తిన వరద

గోదావరికి మళ్లీ వరద పోటెత్తుతోంది. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజీకి 13.19లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లోని లంక గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. గౌతమి, వశిష్ట, వైనతేయ నదులు పొంగిపొర్లుతున్నాయి. అయినవిల్లి, పి.గన్నవరం, మామిడికుదురు మండలాల్లో లంకప్రాంతాల్లో గోదావరి వరద ప్రభావం అధికంగా ఉంది. కనకాయిలంక కాజ్ వేపై వరద నీటి ఉధృతితో బోట్లపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అయినవిల్లి లంక కాజ్ వే పైకి వరద నీరు చేరింది. దీంతో నాలుగు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిపోయాయి. వరద తీవ్రత పెరుగుతుండడంతో కోటిపల్లి-ముక్తేశ్వరం రేవులో పంటు ప్రయాణాలు నిలిపివేశారు. ఇప్పటికే అనేక లంక గ్రామాలకు రవాణా సౌకర్యాలు నిలిచిపోయాయి. అల్లవరం మండలం బోడసకుర్రు పల్లిపాలెంలోకి వరద నీరు చేరుతోంది. గోదావరి నదికి వరద ఉధృతి గంటగంటకూ పెరుగుతుండడంతో పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అంబేద్కర్ సూచించారు. అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు, భీమవరం జిల్లాల అధికారులను అప్రమత్తం చేశామని, వరద ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నామని తెలిపారు. జులై నెలాఖరులోనే గోదావరి నదికి భారీ వరద రావడంతో వందలాది తీర, లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ముంపుకు గురైన వరద ప్రభావిత ప్రాంతాలలో పరిస్థితులు ఇంకా పూర్తిగా మెరుగుపడలేదు.

అమలు కాని... విద్యాహక్కు

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశాలు సెప్టెంబరు 2 నుంచి 9వ తేదీ వరకు కల్పిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే సరికి దాదాపు రెండు నెలలు పడుతుంది. ఇప్పటికే పాఠశాలలు పునఃప్రారంభమై, రెండు నెలలవుతున్నాయి. ఈ చట్టం కింద ప్రవేశాలు పూర్తయ్యే నాటికి, మరో రెండు నెలలు పడుతుంది. వెరసి మొత్తంగా నాలుగు నెలలపాటు ఒకటో తరగతి విద్యార్థులు వెనుకబాటుకు గురవుతారు. ప్రభుత్వం ఒక పద్ధతి, ప్రణాళిక లేకుండా, విద్యాహక్కు చట్టం కింద ప్రవేశాలకు ప్రకటన ఆలస్యంగా ఇవ్వడంతో తల్లిదండ్రులు తర్జనభర్జన పడుతున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ప్రస్తావనేదీ?

విద్యా హక్కు చట్టం ప్రవేశాలపై కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల నోటీసు బోర్డులో ఎలాంటి సమాచారం అందుబాటులోకి ఉంచలేదు. రాష్ట్రంలోని ప్రైవేట్ సీబీఎస్‌సీ స్కూళ్లల్లోనూ చట్టం అమలుపై నిర్లక్ష్యం చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రవేశాలు పూర్తయ్యాయని, సీట్లు లేవనీ తల్లిదండ్రులకు యాజమాన్యం చెబుతోంది. ఈ చట్టం కింద ప్రవేశాలంటేనే, ప్రైవేట్ యాజమాన్యం ముఖం చాటేస్తున్నట్లు సమాచారం.

ఒకటో తరగతిలో ప్రవేశాలపైనా తల్లిదండ్రుల్లో గందరగోళం నెలకొంది. ఇప్పటికే వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలోకి తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించారు. మళ్లీ వారు విద్యా హక్కు చట్టం కింద ప్రవేశాల కోసం దరఖాస్తు చేస్తే, వారికి ఉన్న చోటే సీటు ఇస్తారా?, లేక ప్రభుత్వమే ఎంపిక చేసిన ప్రైవేట్ పాఠశాలల్లో సీట్లు కేటాయిస్తుందా? అనే దానిపై స్పష్టత లేదు. ఈ సీట్ల ఎంపికలో సీబీఎస్ఈ స్కూళ్లు, కార్పొరేట్‌లోని ఐఐటీ ఫౌండేషన్, టెక్నో స్కూళ్లల్లో ఒకటో తరగతి నుంచి ప్రవేశాలు కల్పిస్తారా? అనేదీ ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై జిల్లా, స్థానిక విద్యాశాఖాధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. చట్టంపై విస్తృతంగా ప్రచారం చేయడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల తల్లిదండ్రులకు చాలా మందికి ఇంతవరకు ఈ చట్టంపై అవగాహన లేదు. దీంతో అర్హులయిన వారంతా దూరమయ్యే పరిస్థితులున్నాయి. ఒకటో తరగతిలో ప్రవేశాలకు బడి ఈడు పిల్లలను గుర్తించడంలోను విద్యాశాఖ విఫలమైందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

విద్యాహక్కు చట్టంపై విస్తృత ప్రచారం చేయాలి - శిఖరం నరహరి (రాష్ట్ర అధ్యక్షులు ఏపీ పేరెంట్స్ అసోసియేషన్)

ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని, ఈ చట్టంపై విద్యాశాఖాధికారులు విస్తృతంగా ప్రచారం చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శిఖరం నరహరి కోరారు. ఈ మేరకు గురువారం విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుడితి రాజశేఖర్‌కు ఆయన వినతిపత్రం పంపారు. చట్టంపై విద్యాశాఖాధికారులు విస్తృతం ప్రచారం చేసి, తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థలో ఒకటో తరగతి ప్రవేశాలకు అనుమతి ఇచ్చిన సంఖ్య వివరాలను బహిర్గతం చేయాలన్నారు.

జీవో నంబరు-129 అమలు చేయకముందే ప్రైవేటు విద్యాసంస్థల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందిన వారిలో అర్హులయిన వారందరినీ, ప్రస్తుత షెడ్యూలు ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, వారు ఇప్పటికే ఫీజులు చెల్లించి ఉంటే వాటిని తిరిగి ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.

నేటికీ పాఠశాల విద్య నోచుకోని పిల్లలను యుద్ధ ప్రాతిపదికన స్థానిక సచివాలయ, వలంటీర్ల సిబ్బంది ద్వారా గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్య హక్కు చట్టం కింద ఉచిత విద్య, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రైవేట్ విద్యా సంస్థల వారీగా ప్రభుత్వం బహిరంగ ప్రకటన విడుదల చేయాలని కోరారు.

సైనిక క్యాంపుపై ఆత్మాహుతి దాడి

(మొదటిపేజీ తరువాయి)

మట్టుబెట్టిందని ఆనంద్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఆరుగురు సైనికులు గాయపడ్డారని, ఆత్మాహుతి దాడిని తిప్పికొట్టే క్రమంలో వారిలో ముగ్గురు సైనిక వీరులు అమరులయ్యారని తెలిపారు. అమరులైన సైనిక సిబ్బందిలో సుబేదార్ రాజేంద్ర ప్రసాద్ (రాజస్థాన్‌లోని జుంజును జిల్లాలోని మాలిగోవెన్ గ్రామానికి చెందినవారు), రైఫిల్‌మెన్ లక్ష్మణన్ డి (తమిళనాడులోని మదురై జిల్లా టి పుదుపట్టి గ్రామానికి చెందినవారు), రైఫిల్‌మెన్ మనోజ్ కుమార్ (హరియాణాలోని ఫరీదాబాద్‌లోని షాజహాన్‌పూర్ గ్రామానికి చెందినవారు) అని ఆయన చెప్పారు. విధి నిర్వహణలో అత్యున్నత త్యాగం చేసిన ఈ సైనిక వీరులకు భారత సైన్యం సెల్యూట్ చేస్తోందని అన్నారు. వారి అత్యున్నత త్యాగం, కర్తవ్య దీక్షకు దేశం వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని ఆయన అన్నారు.

అధికారులు, ప్రత్యక్ష సాక్షుల ప్రకారం, ఇక్కడి నుంచి 185 కిలోమీటర్ల దూరంలో ఉన్న పర్ఘల్ వద్ద ఉన్న శిబిరం బాహ్య కంచెను ఉగ్రవాదులు ఉల్లంఘించడానికి ప్రయత్నించినప్పుడు తెల్లవారుజామున 2 గంటలకు మొదటి తుపాకీ శబ్దం వినిపించింది. స్వాతంత్ర్య దినోత్సవానికి నాలుగు రోజుల ముందు జరిగిన ఈ దాడి, మూడు సంవత్సరాల తర్వాత జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి 'ఫిదాయీన్' (ఆత్మాహుతి దాడి చేసేవారు) తిరిగి రావడాన్ని సూచిస్తుంది. దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలోని లెత్‌పోరాలో ఫిబ్రవరి 14, 2019న జరిగిన చివరి దాడిలో 40 మంది భారత జవాన్లు మరణించారు. గురువారం నాటి దాడిలో నిషేధిత జైషే మహ్మద్‌కు చెందిన ఇద్దరు ఆత్మాహుతి దళ సభ్యులు శిబిరంలోకి చొరబడేందుకు ప్రయత్నించారని, అయితే వారిని తిప్పికొట్టినట్లు పోలీసు డైరెక్టర్ జనరల్ దిల్‌బాగ్ సింగ్ పీటీఐకి తెలిపారు. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం, ఉదయం 6.10 గంటలకు చివరి తుపాకీ శబ్దం వినిపించింది. జమ్ము జోన్‌కు నాయకత్వం వహిస్తున్న అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ముఖేష్ సింగ్ మాట్లాడుతూ దర్హాల్ పోలీస్ స్టేషన్ నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న సైనిక క్యాంప్‌నకు మరిన్ని బలగాలను పంపినట్లు తెలిపారు. సోదాలు, కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోందని తెలిపారు. రాజౌరీ ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికల పై నిఘా వర్గాల సమాచారం నేపథ్యంలో భద్రతా బలగాలు, పోలీసులు అప్రమత్తమయ్యారు. బుధవారం దర్హాల్, నౌషేరా బెల్ట్‌లో కూంబింగ్ ఆపరేషన్‌ను ప్రారంభించారు. గతంలో ఏప్రిల్ 22న ప్రధాని నరేంద్ర మోదీ జమ్ములో పర్యటన జరగాల్సిన సమయంలో కూడా జైషే మహ్మద్ ఉగ్రవాదులు 'ఆత్మాహుతి' దాడికి ప్రయత్నించారు.

అయితే సుంజావాన్ ఆర్మీ క్యాంపు సమీపంలో సీఐఎస్ఎఫ్‌తో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. పారామిలటరీ దళానికి చెందిన ఓ అధికారి కూడా మరణించారు. మే 8న, రాజౌరి జిల్లాలోని లామ్ ప్రాంతంలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వెంబడి చొరబాటు ప్రయత్నాన్ని సైన్యం విఫలం చేయడంతో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆత్మాహుతి దాడిని ఖండించారు. ఉగ్రవాదులు, వారి మద్దతుదారులతో తగిన రీతిలో వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఆయన ఈ మేరకు ఒక ట్వీట్‌లో అత్యున్నత త్యాగం చేసిన వీర జవాన్లకు నివాళులు తెలుపుతూ, ఆ వీర యోధుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

వైసీపీ ప్రభుత్వం కళ్లున్న కబోది

- తక్షణం ఎంపీ మాధవ్‌ను అరెస్టు చేయాలి
- మహిళాసమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవానీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఎంపీ గోరంట్ల మాధవ్ నగ్న వీడియో వ్యవహారంలో కళ్లున్న కబోదిలాగా వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ తీవ్రంగా విమర్శించారు. ఎంపీ గోరంట్ల మాధవ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దుర్గాభవానీ మాట్లాడుతూ... దేశంలో, రాష్ట్రంలో సంచలం సృష్టించిన గోరంట్ల వ్యవహారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోవడం సిగ్గు చేటన్నారు. ఎస్పీ ఫకీరప్ప మాటలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయని చెప్పారు. మాధవ్, ఎస్పీ, హోంమంత్రి చెప్పిన మాటలకు ఎక్కడా పొంతనలేదన్నారు. మరోపక్క ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి నాలుగు గోడల మధ్య జరిగిందని చెప్పడం సిగ్గు చేటన్నారు. మాధవ్ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలను బయటకు తీసి, అతడిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనకు చేస్తామని హెచ్చరించారు. యువజన సమాఖ్య ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవింద రాజులు మాట్లాడుతూ... మహిళకు నగ్నంగా వీడియో కాల్ చేసి అసభ్యకరంగా ప్రవర్తించిన వైసీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ వికృత చేష్టలను దేశమంతా అసహ్యించుకుంటోందని తెలిపారు. ఎంపీ రాసలీలలు బయట పడినా మిన్నకుండడం తగదని, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, నగర కమిటీ సభ్యులు సీతా రావమ్మ, డీ రవణమ్మ, డీ పుష్ప, భాగ్యలక్ష్మీ, జీ రాహేలమ్మ, మణికుమారి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పృథ్వీ, నగర కార్యదర్శి ఎండీ మోహీన్, నగర నాయకులు పీ ఆంజనేయులు, ఆంజనేయులు, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి సాయి కుమార్, కమిటీ సభ్యులు చందు, శ్రీనాథ్, అయ్యప్ప, టీ మధు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు రాఖీలు కట్టిన మహిళా నేతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) సందర్భంగా తన నివాసంలో సీఎం జగన్‌కు ఈశ్వరీయ బ్రహ్మకుమారి ప్రతినిధులు రాజయోగిని బ్రహ్మకుమారి, శాంత దీదీజీ, పద్మజ, మానస రాఖీ కట్టారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా సెప్టెంబర్‌లో మౌంట్ అబూలో జరిగే గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలంటూ సీఎంను బ్రహ్మకుమారి ప్రతినిధులు ఆహ్వానించారు. హోం మంత్రి తానేటి వనిత, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, మహిళా కమి షన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, వీఎం ఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్రమాని విజయనిర్మల, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, మహిళా కమిషన్ సభ్యులు కర్రి జయశ్రీ, గెద్దం ఉమ రాఖీలు కట్టారు.

అక్క, చెల్లెమ్మలకు రాఖీ శుభాకాంక్షలు: సీఎం జగన్

రాఖీ పండుగ సందర్భంగా రాష్ట్రంలో ప్రతి అక్కకు, చెల్లెమ్మకు, పాపకు, మహిళకు సీఎం వైఎస్ జగన్ శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధనం అనేది ఆత్మీయతలు, అనురాగాల పండుగ అని, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా, రక్షణపరంగా మహిళలకు మంచి చేసే విషయంలో మన రాష్ట్రం దేశంలోనే ముందున్నదనీ, అక్కచెల్లెమ్మల చల్లని దీవెనలు, దేవుడి ఆశీస్సులు కలకాలం లభించాలని సీఎం జగన్ గురువారం తన సందేశంలో పేర్కొన్నారు.

ప్రజల సంపద దోచిపెడుతున్న మోదీ

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ
- 546వ రోజుకు రిలే దీక్షలు

విశాలాంధ్ర- కూర్మన్నపాలెం: ప్రజల సంపదను కార్పొరేట్‌లకు దోచిపెడుతున్న నరేంద్ర మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న రిలే దీక్షలు గురువారం 546వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ, ఎన్నో పోరాటాలు, 32 మంది ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్రం కార్పొరేట్‌లకు కట్టబెట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోందనీ, దీన్ని పోరాటాల ద్వారా అడ్డుకుంటామని అన్నారు. ప్రజల సంపదను అమ్మే హక్కు కేంద్రానికి లేదని పేర్కొన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీక్షల్లో కె.పరంధామయ్య, సీహెచ్.సన్యాసిరావు, సీపీఐ గాజువాక నియోజక వర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, డి.దేముడు, జి.ఆనంద్, ఐ.చిట్టిబాబు, జీవీ రమణా రావు, ఎం.కె.వి.రాజేశ్వరరావు, డి.రమేష్, ఆర్.సూరిబాబు, జి.బి.సత్యనారాయణ, ఎస్. కె.మహ్మద్ పాల్గొన్నారు.

'హర్ ఘర్ తిరంగా' విజయవంతం చేయండి

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను తమ నివాసాలపై ఆవిష్కరించటం ద్వారా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాల నేపథ్యంలో రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తూర్పు నౌకాదళ కమాండ్‌కు చెందిన గ్యాలంట్రీ అవార్డు గ్రహీతలను గవర్నర్ సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 13 నుంచి 15 వరకు ప్రతి ఒక్కరూ జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశం యావత్తు ఆజాదీ కా మహోత్సవ్‌ను జరుపుకుంటున్న శుభతరుణంలో గ్యాలంట్రీ అవార్డు గ్రహీతలకు సన్మానం చేయటం ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. 1971 యుద్ధంలో భారతదేశం విజయం సాధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 'స్వర్ణిం విజయ్ వర్ష్' ఉత్సవాల్లో భాగంగా రాజ్‌భవన్‌కు తీసుకొచ్చిన 'విక్టరీ జ్వాల'ను గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఇటీవల న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం సందర్శన తనకు చిరస్మరణీయమైన ఘట్టమని, జీవితాలను త్యాగం చేసిన వీర యోధులకు గౌరవ సూచకంగా స్మారక చిహ్నం వద్ద వారికి నివాళి అర్పించటం మరిచి పోలేనిదన్నారు. భారత జాతీయ జెండా మన ఆశలు, ఆకాంక్షలను సూచిస్తుందని, అది భారతీయుల గర్వానికి చిహ్నమని గవర్నర్ అన్నారు.

గ్యాలంట్రీ అవార్డు గ్రహీతలు కమోడోర్ వరుణ్ సింగ్, కెప్టెన్ మిలింద్ మోహన్ మొకాషి, కెప్టెన్ ఎకెతోమురోతు, శైలేందర్ సింగ్, ధీరేందర్, లెఫ్టినెంట్ కమాండర్ మను మిశ్రా, పీటీ ఆఫీసర్లు ప్రకాష్ సింగ్, విజయ్ కుమార్ వర్మ, ఎల్ఎ అమిత్, ఎంసిఎ రమేష్ కుమార్ , రిటైర్డ్ సిబ్బంది కమోడోర్ చిన్నవీరయ్య, కమాండర్ జై ప్రకాష్, లక్ష్మణరావు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నావల్ ఆఫీసర్-ఇన్-ఛార్జ్ కమోడోర్ ఎం. గోవర్ధన్ రాజు, కోఆర్డినేటింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ దినేష్ కుమార్, గవర్నర్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాష్, ఉప కార్యదర్శి సన్యాసిరావు పాల్గొన్నారు.

నిరాడంబరంగా రక్షాబంధన్

రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా రాఖీ వేడుక నిర్వహించారు. విద్యార్థుల వినతిమేరకు అతికొద్ది మందిని మాత్రమే రాజ్‌భవన్‌లోకి అనుమతించారు. చిన్నారులు గవర్నర్‌కు రాఖీకట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా వారిని పేరుపేరునా గవర్నర్ పలుకరించి ఉజ్వల భవిష్యత్తును పొందాలని ఆశీర్వదించారు.

హెల్ప్ ప్రతినిధికి అమెరికా ప్రభుత్వ ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'మానవ అక్రమ రవాణా నిరోధం, లింగ ఆధారిత హింసను ఎదుర్కోవడం' అనే అంశంపై అమెరికాలో అక్కడి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలు, సాధించిన విజయాలపై అధ్యయనం చేసేందుకు వీలుగా అమెరికన్ ఎంబసీ అంతర్జాతీయ సందర్శకుల లీడర్‌షిప్ కార్యక్రమానికి హెల్ప్ సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ వి.భాస్కర్‌రావును ఎంపిక చేశారు. ఈ మేరకు గురువారం అమెరికా ప్రభుత్వం నుంచి ఆయనకు ఆహ్వానం అందింది. హెల్ప్ సంస్థ రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా నిరోధానికి 20 ఏళ్లుగా పనిచేస్తోంది. పోలీస్ అధికారుల సహకారంతో అక్రమ రవాణా బారినపడిన బాధిత మహిళలు, బాలికలను విముక్తి చేయడం, వారికి రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలు అందేలా చూడడం, బాధితులకు పునరావాసం కల్పించడంతో పాటు హక్కులు కాపాడుకునేందుకు వీలుగా తగిన శిక్షణ ఇస్తోంది. బాధిత మహిళల అభివృద్ధి, రక్షణ, పునరావాసం కోసం భాస్కరరావు చేస్తున్న కృషిని అమెరికా ఎంబసీ గుర్తించి, అంతర్జాతీయ సందర్శకుల లీడర్ షిప్ కార్యక్రమానికి ఆహ్వానించింది. ఆయన ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 2 వరకు అమెరికాలోని వివిధ ప్రాంతాలు సందర్శించి అక్కడి ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలతో సమావేశమై మానవ అక్రమ రవాణా నిరోధం, లింగ ఆధారిత హింస ఎదుర్కోవడానికి వారు చేపట్టే అంశాలపై అధ్యయనం చేస్తారు.

గోరంట్లపై చర్యలకు ఆదేశించండి

ప్రధాని, స్పీకర్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు ఎంపీ జస్బీర్ సింగ్ లేఖలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యవహారం జాతీయస్థాయిలో రభస అవుతోంది. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యంత జుగుప్సాకరమైన ఒక ఎంపీ నగ్న వీడియో దేశవ్యాప్తంగా వైరల్ అయినప్పటికీ, వైసీపీ అధిష్ఠానంలో చలనం కనిపించడం లేదు. పైగా అతడిని రక్షించేందుకు నేతలు అది మార్ఫింగ్ వీడియో అంటూ సమర్థించే చర్యలకు పాల్పడుతున్నారు. దీనిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ జస్బీర్ సింగ్ గురువారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రధానితో పాటు లోక్‌సభ స్పీకర్, జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు కూడా ఆయన లేఖలు రాశారు. గోరంట్ల వీడియో వ్యవహారం పార్లమెంట్ వ్యవస్థను, గౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని లేఖలో పేర్కొన్నారు. ఎంపీలకు మాయని మచ్చలా ఉందని తెలిపారు. ఎంపీ అంటే మేల్ ప్రాస్టిట్యూట్ అని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోరంట్ల మాధవ్ వీడియో ఫోరెన్సిక్‌కు వెళ్లిందని వైసీపీ ఎంపీ భరత్ అన్నారని, మిగిలినవారు ఒక్కొక్కరు ఒక్కోలా మాట్లాడుతున్నారని చెప్పారు. లేఖతో పాటు నగ్న వీడియోను కూడా జత చేశారు. గోరంట్లపై తక్షణ చర్యలకు ఆదేశించడం ద్వారా పార్లమెంటు సభ్యుల ప్రతిష్ఠను కాపాడాలని కోరారు.

తుంగభద్ర డ్యామ్‌కు వరద ప్రవాహం

నదిలోకి 1,80,818 క్యూసెక్కుల నీరు విడుదల

విశాలాంధ్ర-హోళగుంద: కర్ణాటక రాష్ట్రంలోని విజయనగర జిల్లా హోస్పేట్ వద్ద తుంగభద్ర డ్యామ్‌లో గురువారం భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. డ్యామ్ ఎగువభాగంలో సివమొగ్గ, మోరల్, దావనగిరి, తీర్థహల్లి తదితర ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాల కారణంగా డ్యామ్‌కు 1,85,363 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. అలాగే డ్యామ్ 33 గేట్లు ఎత్తి తుంగభద్రా నదిలోకి 1,80,818 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. 33 గేట్లలో 28 గేట్లు నాలుగు అడుగుల మేర ఎత్తగా మిగిలిన ఐదు గేట్లను ఒక అడుగు మేర ఎత్తి నీటిని నదికి విడుదల చేశారు. భారీ స్థాయిలో వరద నీరు చేరడంతో డ్యామ్‌లో నీటి ప్రవాహం తగ్గడం లేదు. హోళగుంద మండలం నుంచి ప్రజలు, రైతులు విద్యార్థులు, ఉద్యోగులు, యువకులు పాలపొంగులా జాలువారుతున్న నీటి ప్రవాహాన్ని వీక్షించేందుకు భారీ సంఖ్యలో డ్యామ్‌కు తరలి వెళ్లారు. డ్యామ్ పూర్తిస్థాయిలో నిండడంతో ఈ ఏడాది రెండు పంటలకు పుష్కలంగా నీరు అందుతుందని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయ ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపునకు ప్రభుత్వం అంగీకారం

ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచడానికి ప్రభుత్వం అంగీకరించిందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి, జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కళ్లేపల్లి మధుసూదనరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2022 నుంచి ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి వాటిని అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు తమకు పదవీ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, ఎయిడెడ్ ఉపాధ్యాయులు, యూనివర్సిటీ ఉద్యోగులు, సొసైటీ ఉద్యోగులు, వివిధ కార్పొరేషన్ల ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారని గుర్తుచేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయస్సును 62 ఏళ్ల పెంపు ప్రతిపాదనకు సీఎం అంగీకరిస్తూ సంబంధిత దస్త్రంపై సంతకం చేశారని తెలిపారు. ఈ మేరకు సీఎం జగన్‌కు నేతలు ధన్యవాదాలు తెలిపారు.

ఎంపీ గోరంట్లపై చర్యలేవి?

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉన్నతస్థాయి పదవిలో ఉండి రాష్ట్ర ప్రతిష్ఠను, మహిళల గౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని కించపరిచేలా వైరల్ అయిన హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ వీడియో వ్యవహారంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా ఈ వ్యవహారం రాష్ట్రమంతా ఆందోళనకు గురిచేస్తున్నప్పటికీ, ప్రభుత్వం అతడిపై ఎలాంటి చర్యా తీసుకోలేదని, పూర్తి సమాచారం రాబట్టకుండా వెనుకేసుకురావడం గర్హనీయమని పేర్కొన్నారు. ఫోరెన్సిక్ పరీక్షకు పంపకుండానే జిల్లా ఎస్పీ, ఆ వీడియో ఒరిజినల్ కాదని ప్రకటించడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు లొంగి ఒక బాధ్యత కలిగిన పోలీసు అధికారి ఇలా ప్రకటించడం అన్యాయమన్నారు. ఇద్దరి మధ్య సంభాషణను మూడో వ్యక్తి రికార్డు చేశారంటున్న ఎస్పీ, అది మార్ఫింగ్ అని చెప్పలేక పోయారన్నారు. ఆ వీడియో మార్ఫిడిది అంటున్న మాధవ్ ఎందుకని పోలీసులకు ఫిర్యాదు చేయలేదంటూ ప్రశ్నించారు. పార్లమెంట్ సభ్యునిగా కొనసాగే నైతిక అర్హతను మాధవ్ కోల్పోయారనీ, తక్షణమే ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

14న మహాత్మాగాంధీ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడలోని (బందరు లాకులు) స్వాతంత్ర్య సమరయోధుల భవనంపై అమర్చిన 30 అడుగుల మహాత్మాగాంధీ నిలువెత్తు విగ్రహాన్ని ఈ నెల 14న ఉదయం 11 గంటలకు గవర్నరు విశ్వభూషణ్ హరిచందన్ ఆవిష్కరిస్తారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్వోదయ ట్రస్ట్, స్వాతంత్ర్య సమరయోధుల సంఘం-విజయవాడ అధ్యక్ష, కార్యదర్శులు జీవీ మోహన్‌ప్రసాద్, మోతుకూరి వెంకటేశ్వరరావు తెలిపారు. గౌరవ అతిథిగా యువజన, పర్యాటకశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రజత్ భార్గవ విచ్చేస్తారన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, వారి వారసులను సన్మానిస్తారు.

సీపీ బ్రౌన్ గ్రంథాలయానికి మరమ్మతులు చేపట్టాలి

విశాలాంధ్ర- కడప కలెక్టరేట్: తెలుగుభాషకు తలమానికమైన కడపలోని సీపీ బ్రౌన్ లైబ్రరీకి ఆధునిక వసతులతో పాటు శిథిలావస్థకు చేరిన భవనాల మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యుడు జానుమద్ది విజయభాస్కర్ కోరారు. ఎంతో చరిత్ర కలిగిన గ్రంథాలయం అస్తవ్యస్థంగా తయారైందని, నిధులు ఉన్నా మరమ్మతులకు నోచుకోకపోవడం ఆవేదనకు గురి చేస్తోందన్నారు. సలహా మండలి ఉన్నా 20 నెలలుగా ఒక్క సమావేశం కూడా జరగలేదని వెల్లడించారు. సీఎం హోదాలో వైఎస్ జగన్ భవన నిర్మాణాలకు రూ.5.50 కోట్లు మంజూరు చేస్తూ శంకుస్థాపన చేసి సంవత్సరం అవుతున్నా ముందడుగు వేయలేదని జానుమద్ది విచారం వ్యక్తం చేశారు. యోగివేమన యూనివర్సిటీలో అతిరథ మహారథులు ఉన్నా గ్రంథాలయాన్ని చిన్నచూపు చూడడం తగదన్నారు. గతంలో మనసు ఫౌండేషన్ సంస్థ గ్రంథాలయంలో తమ సిబ్బందిని నియమించి డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టారనీ, దాదాపు నెల రోజులుగా వారు రాకపోవడంతో అదికాస్త నిలిచిపోయిందన్నారు. కేవలం అధికారులు ప్రచారం కోసం ఆర్భాటాలు చేస్తున్నారు తప్ప గ్రంథాలయానికి ఒరిగిందేమీ లేదని విమర్శించారు. దాదాపు 5 సంవత్సరాల నుంచి గ్రంథాలయానికి ఒకరినే బాధ్యులుగా నియమించి కొనసాగించడం విడ్డూరమన్నారు. నిర్లక్ష్య ధోరణి విడనాడి గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లా అధికారులు కూడా చొరవ చూపాలని కోరారు.

సీపెట్ డిప్లొమోలతో ఉద్యోగాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)-విజయవాడ ప్లాస్టిక్స్ టెక్నాలజీ విభాగం... డిప్లొమో, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమో కోర్సుల ద్వారా యువతకు మెరుగైనఉద్యోగాలు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ సంయుక్త సంచాలకులు సీహెచ్ శేఖర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... దేశ వ్యాప్తంగా ప్లాస్టిక్ అనుబంధ సంస్థల్లో ప్లాస్టిక్స్ ప్రొడక్షన్, మౌల్డ్ తయారీ, క్వాలిటీ నిర్ధారణ విభాగాల్లో ఖచ్చితమైన ప్లేస్‌మెంట్‌ను అందిస్తున్నామని పేర్కొన్నారు. సీపెట్ కోర్సులకు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉందని, మూడేళ్ల వ్యవధిగల డిప్లొమో ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమో ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సులకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, రెండేళ్ల వ్యవధిగల ప్లాస్టిక్స్ ప్రాసెస్సింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ- పీపీటీ) కోర్సుకు బీఎస్సీ ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు అర్హులని వివరించారు. విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా వసతి గృహ సౌకర్యం ఉందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ప్రవేశాల కోసం 9849296296 నంబరులో సంప్రదించాలని కోరారు.

తెలంగాణలో కొత్తగా 10 లక్షల పింఛన్లు

- 5 వేల అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టుల భర్తీ
- సత్ప్రవర్తన కలిగిన 75 మంది ఖైదీల విడుదల
- మంత్రివర్గం సమావేశంలో నిర్ణయం

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ప్రగతి భవన్‌లో గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఐదు గంటల పాటు సాగిన ఈ భేటీలో అనేక అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 36 లక్షల ఆసరా పింఛన్లకు అదనంగా కొత్తగా మరో 10 లక్షల పింఛన్లు ఇవ్వాలని మంత్రి వర్గం తీర్మానించింది. ఆగస్టు 15 నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాల సందర్భంగా సత్ప్రవర్తన కలిగిన 75 మంది ఖైదీలను విడుదల చేయాలని, ఈనెల 21న శాసనసభ, స్థానిక సంస్థల ప్రత్యేక సమావేశాలు రద్దు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉన్నందున ప్రజాప్రతినిధుల నుంచి వినతులు రావడంతో ప్రత్యేక సమావేశాల రద్దుకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో 5,111 అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టులు భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. కోఠిలో అధునాత ఆస్పత్రి నిర్మాణానికి, సరోజినీదేవి కంటి ఆసుపత్రిలో భవన సముదాయం నిర్మాణానికి ప్రతిపాదనల తయారు చేయాలని ఆదేశించింది. కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రికి 10 మంది స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో భాగంగా ఈనెల 16న ఉదయం 11.30 నిమిషాలకు రాష్ట్ర వ్యాప్తంగా సామూహిక జాతీయ గీతాలాపన జరపాలని నిర్ణయించారు. జీవో 58, 59 కింద పేదలకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని మంత్రివర్గం ఆదేశించింది. గ్రామకంఠంలో నూతన ఇళ్ల నిర్మాణానికి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులతో ఒక కమిటీ వేసి, 15 రోజుల్లోగా ఒక నివేదిక ఇచ్చి, సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని నిర్ణయించింది. వికారాబాద్‌లో ఆటోనగర్ నిర్మాణానికి 15 ఎకరాల స్థలాన్ని, తాండూరు మార్కెట్ కమిటీకి యాలాలలో 30 ఎకరాల ఎకరాల స్థలం కేటాయించాలని, షాబాద్‌లో బండల పాలిషింగ్ యూనిట్ల ఏర్పాటుకు టీఎస్ ఐఐసీ అధ్వర్యంలో 45 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ మంత్రివర్గం నిర్ణయించింది.

సంపాదకీయం

అమృతోత్సవ వేళా చర్చలేని చట్టాలేనా..!

అమృతోత్సవ వేళ సైతం మోదీ ప్రభుత్వం గత ఎనిమిదేళ్లుగా అనుసరిస్తున్న ఏకపక్ష నిర్ణయాలు, విధివిధానాల్లో ఎలాంటి మార్పు లేదు. దేశం స్వాతంత్ర్యం పొంది 75 ఏళ్లు అవుతున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా సంబరాలు జరుపుకోవాలని ప్రధాని పిలుపు నిచ్చారు. నిజంగా సంబరాలు చేసుకోవలసిన సందర్భమే. పేదరికంలో మగ్గుతూ, ఆకలితో అల్లాడుతున్న కోట్లాది మంది ప్రజలు ఈ సందర్భాన్ని పట్టించుకొనే అవకాశం ఉందా? ఏ మాత్రం లేదని దేశ పరిస్థితులను నిశితంగా పరిశీలించే వారికి అర్థమవుతుంది. 135 కోట్ల మంది ప్రజలను ప్రభావితం చేసే పార్లమెంటు ద్వారా ప్రభుత్వం చేసే నిర్ణయాలు, చట్టాలపై సుదీర్ఘంగా చర్చించవలసిన అవసరం ఎంతైనా ఉంది. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత కొంతకాలం కేంద్ర ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేసే చట్టాలను రూపొందించడానికి పార్లమెంటులో లోతుగా చర్చించి నిర్ణయాలు తీసుకొనే మంచి సంప్రదాయాన్ని అను సరించాయి. నెహ్రూ ప్రభుత్వం ఈ సంప్రదాయాన్ని నెలకొల్పింది. ప్రతిపక్షాలకు గౌరవమిస్తూ, వారు ఇచ్చే మంచి సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకుని ప్రతిపాదిత బిల్లులో చేర్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పార్లమెంటు సమావేశాల్లో చర్చలు ఆసక్తి కలిగించేవి. నెహ్రూ ప్రభుత్వ దార్శనికత వల్ల ప్రభుత్వ రంగంలో అనేక పరిశ్రమలు, విద్య, వైద్య విశ్వవిద్యాలయాలు తదితరం అనేకం ఏర్పడి ప్రజలకు సేవలు అందించాయి. పార్లమెంటు తీసుకున్న ప్రజానుకూల నిర్ణయాలు ఇందుకు దోహదం చేశాయి. 2014లో ప్రధాని వచ్చిన తర్వాత తన రహస్య లక్ష్యం నెరవేర్చుకొనే దిశగా అన్ని నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకుంటోంది. ప్రజలను ఓట్లు వేసే వారిగానే చూస్తూ వారి సంక్షేమాన్ని గాలికి వదిలేసే సరికొత్త సంప్రదాయాన్ని నెలకొల్పింది. తాజాగా దాదాపు రెండు వారాలు జరిగిన పార్లమెంటు సమావేశాలు ఎనిమిది బిల్లులను ఆమోదించింది. ప్రజ లపై ప్రతికూల ప్రభావాన్ని చూపి ఇప్పటికే అతలాకుతలమైన వారి జీవితా లను మరింతగా దుర్భరం చేసే బిల్లులను సైతం మూజువాణి ఓటుతో ఆమోద ముద్ర వేయించుకున్నారు. దేశ ప్రజలను మరింత దారిద్ర్యంలోకి నెట్టి వారిపై ఆర్థిక భారాలను మోపే నిర్ణయాలను చర్చించాలన్న ప్రతిపక్షాల ప్రతిపాదనను ఏ మాత్రం పట్టించుకోలేదు. ఆమోదించిన బిల్లుల్లో సెంట్రల్ యూనివర్సిటీల సవరణ బిల్లు ఉంది. ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొ రేట్ల, బడా పారిశ్రామికవేత్తల లాభాలను చేకూర్చే వాటిల్లో ఇదొకటి. ఇప్ప టికే విద్యా రంగాన్ని ప్రైవేటీకరించి చదువులను ప్రజలందరికీ అందు బాటులో లేకుండా చేసే నిర్ణయాలను గత, నేటి ప్రభుత్వం తీసుకున్నాయి. మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగంలోని అన్ని సంస్థలను ప్రైవేటు పెట్టుబడిదారులకు కట్టబెట్టాలని కంకణం కట్టుకున్నది. ప్రజలు అందించిన సహకారంతో ఎన్నికల్లో గెలిచి తన పాలనలో ఆ ప్రజలనే మోసగిస్తూ తనకు, తన ఆశ్రితులకు అనుకూలంగా నిర్ణయాలు చేశారు. తాజాగా పార్లమెంటు ఆమోదించిన కుటుంబ కోర్టుల సవరణ బిల్లు నేర విచారణ క్రమాన్ని సవరించే బిల్లు తదితరాలున్నాయి. ఇవన్నీ ప్రజా జీవితాలను ప్రభావితం చేసేవే కావడం వల్ల పార్లమెంటు సమగ్రంగా చర్చించాలి. పార్లమెంటులో సమగ్రంగా చర్చించి చట్టాలు చేయవలసిన అవసరం ఉందని ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన సూచనలు సైతం ఈ ప్రభుత్వ లోపాన్ని ఎత్తి చూపిందని భావించాలి. అయినప్పటికీ ప్రభుత్వ తీరు తెన్నుల్లో ఇసుమంత కూడా మార్పులేదని ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాలు మరింత స్పష్టం చేశాయి. ఈ సమావేశాల నిర్వహణ కోసం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తారు. ఇదంతా ప్రజల కష్టార్జితమన్న స్పృహ పాలకులకు ఏ మాత్రం లేదు. మొక్కుబడిగా నిర్వహిస్తున్న పార్ల మెంటు సమావేశాలు కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే నిర్ణయాలు తీసుకోవ డానికేననేది నిర్వివాదాంశం.

సమావేశాల్లో ప్రతిపాదించిన మరో బిల్లు విద్యుత్ (సవరణ) బిల్లు, ప్రతి పక్షాలను ఏ మాత్రం పట్టించుకోకుండా ఈ బిల్లును ఆమోదింపజేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివాదాస్పదమైన రైతుల జీవితాలను, వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని రైతులు మహత్తర పోరాటం చేశారు. ఈ చట్టాలను రూపొం దించే సందర్భంగానే విద్యుత్ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఏడాదికి పైగా రైతులు సాగించిన మహోద్యమానికి దేశ కార్మిక వర్గం, ట్రేడ్ యూనియన్లు, ప్రజా సంఘాలు అండగా నిలిచాయి. యుపి, పంజాబ్, తదితర ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలవుతామన్న భయంతో మూడు వ్యవసాయ చట్టాలను మోదీ ఉపసంహరించుకొన్నారు. అప్పుడే విద్యుత్ బిల్లును ఆమోదించాలన్న నిర్ణయం అమలు జరగలేదు. తాజాగా ప్రవేశపెట్టిన బిల్లును ఎట్టకేలకు సెలక్టు కమిటీ పరిశీలనకు పంపడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఆయా రాష్ట్రాల రైతులకు, గృహ వినియోగదారులకు మరింత ఆర్థిక భారాన్ని కలిగిస్తాయనేది సుస్పష్టం.

రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో విద్యుత్ పంపిణీ డిస్కంలకు నష్టాలు వస్తు న్నాయనే సాకుతో ఈ బిల్లును రూపొందించారు. ఈ బిల్లు ప్రకారం విద్యుత్ చట్టంలోని సెక్షన్ 42ను సవరిస్తారు. దీని ద్వారా విద్యుత్ పంపిణీ వ్యవస్థ లోకి ప్రైవేటు వ్యక్తులను ప్రవేశ పెడతారు. క్రమంగా అజమాయిషీ నుండి ప్రభుత్వం తప్పుకుంటుంది. ప్రైవేటురంగం ఇష్టారాజ్యంగా విద్యుత్ ఛార్జీలను పెంచుతుంది. దేశంలో మారుమూలలనున్న ప్రజ లందరికీ విద్యుత్‌ను అందిం చాలన్న గొప్ప లక్ష్యాన్ని ప్రైవేటు రంగం పట్టించుకోదు. ఇప్పటికే అనేక వేల గ్రామాల ప్రజలు విద్యుత్ వెలుగులు లేక ఇబ్బందులు పడుతూ ఉన్నారు. ఈ బిల్లు చట్ట రూపం దాలిస్తే వినియోగదారులందరూ మోదీ పాలనలో అన్ని వస్తువుల ధరల మోతను విద్యుత్ ఛార్జీల మోతను భరించవలసిందే. రైతులు పోరాటం చేసేటప్పుడే దీన్ని వ్యతిరేకించారు. లాభాలు వచ్చే ప్రాంతాల్లో విద్యుత్ పంపిణీని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడతారు. ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ సంక్షోభంలోకి వెళుతుంది. ఈ బిల్లును ప్రవేశపెట్టిన ఈ నెల 8వ తేదీనే 27 లక్షల మంది విద్యుత్ ఇంజ నీర్లలో అత్యధికం ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి పక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇంజనీర్ల ఉద్యోగాలు ఊడిపోయే ప్రమాదం ఉంది. ఆర్థిక భారాలను మోయడానికి అలవాటుపడిన ప్రజలూ గట్టిగా స్పందించవలసిన సమయమిది.

కళలు ఎవరి కోసం

రా బావా ఏంటి ఈ రోజు ఏదో రాగం తీస్తూ వస్తున్నావ్. ఏం లేదు బావా రాత్రి ఘంటసాల కళా మందిరంలో నాటకానికి వెళ్లాను. అందులో నా కిష్టమైన కేదార గౌళి రాగం పాడాడు. చాలా బాగా పాడాడు బావ నా ఊళ గేదార గౌళ అంటాడు శ్రీశ్రీ. అది సరే బావా అసలు ఈ కళలు ఎలా పుట్టాయి. ఎవరి కోసం ఎందు కోసం అనే మీమాంస నాకెప్పటి నుండో ఉంది. రాజకీయాలు పక్కన పెట్టి నా డౌట్ తీర్చాలి. అలాగే బావ అసలు కళలు తెలియనివాడు ఎవడూ ఉండడని మాట్లాడేటప్పుడు ముఖ కవళికలు మారిపోవడం, చేతులు ఊపడం యివన్నీ ప్రతి మనిషి చేసే పని గనుక కళాకారుడు కానివాడెవడు అంటారు మహాకవి రాచకొండ విశ్వనాథశాస్త్రి.

అది సరే బావ అసలు కళలు కళ కోసమా, కళాకారుని కోసమా, ప్రజల కోసమా అది చెప్పు. కళలంటే సాహిత్యం, సంగీతం, నాట్యం, నాటకం యివన్నీ మనసుకు ఆహ్లాదం కల్గించేవి కదా. అదికాదు నేను విన్న ఉపన్యాసంలో కళలు ఒకనాడు రాజుల కోసమని, ఆ తరవాత కళలు మతస్థుల కోసమని, గరికపాటి రాజారావు వాటిని ప్రజల కోసంగా మార్చాడని విన్నాను. అది నిజమే బావా. రాజుల్ని సంతోష పెట్టడానికి కళాకారులు నృత్యం చేశారు. ఆ తరవాత నాటకాలు ఆడారు. నీవన్నట్లు మత మౌఢ్యం కలవారు మతాన్ని పెంచుకోవడం కోసం కళల్ని వాడుకున్నారు. భారత, రామాయణ, భాగవతంలోని యితివృత్తంగా తీసుకుని కవులు రాయగా,

బతుకుదెరువు కోసం వాటిని కళాకారులు ప్రదర్శించారు. తద్వారా మత మౌఢ్యం. సత్యానికి దూరంగా అసత్యాలు కళల ద్వారా ప్రజల బుర్రలో నాటుకుపోవడం వల్ల యిప్పటికీ ఆ సెంటిమెంటు నుండి బయటపడలేక పోతున్నారు. ఆ తరవాత కళలు వ్యాపారంగా మారి నటుని సామర్థ్యాన్ని బట్టి రేటు నిర్ణయమైంది.

అది సరే బావా కళల్లో వర్గ విభజన లేదు కదా అటువంటి కళల్ని వర్గ విభజనదారులు మతస్థులు వాడుకొని ప్రజల్ని అజ్ఞానులుగా చేసి మూఢ నమ్మకాలలో ముంచుతున్నారు. వాటిని ఎలా ఆపాలి. బావా అసలు మనిషిలో ఉన్న కళ మనిషికే ఉపయోగపడాలి. సమాజంలో భాగమైన మనిషి తన కళను సమాజ శ్రేయస్సు కోసమే ఉపయోగించాలనే తపనతోనే గరికపాటి కళల్ని ప్రజా కళలుగా మార్చి కళల ద్వారా ముఖ్యంగా బుర్రకథలు, నాటకాల ద్వారా ప్రజల్ని చైతన్యవంతులుగా చేశారు. అందుకే ఒకనాడు జమీందారులకో, మత వ్యాప్తికో, దైవం కోసమో ఉపయోగపడిన కళలు ఈనాడు ముఖ్యంగా నాటకాల ద్వారా ప్రజలకు దగ్గరై ప్రజా కళలుగా మారాయి. గతంలో ఈ కళల ద్వారా దశ కంఠలు, శత కంఠలు, గరళ కంఠలు, చతుర్ముఖులు మనిషి మస్తికంలో తిష్ఠ వేయడం వలనే ప్రజా కళల రూపంలో వాస్తవిక చిత్రణ కోసం ప్రజల అవసరాల కోసం పోరాటం చేసేటట్లు ప్రజా కళలు కృషి చేస్తున్నాయి బావా. అందుకు కమ్యూనిస్టులు అవిరళ కృషి సల్పటం వివిధ రూపాలకు చెందిన కళాకారుల్ని పోషించడం ద్వారా ప్రజల్లో చైతన్యానికి నాంది పలికింది కమ్యూనిస్టు పార్టీలే బావా.

అది సరే బావా సంగీతానికి రాళ్లు కరుగుతాయని, శంకరాభరణం రాగం ఆలపిస్తే పాములు పరుగున వస్తాయని అంటారు అదేంటి బావా. మంత్రాలకు చింతకాయలు రాలడం ఎంత నిజమో అవి అంతే బావా. సంగీతం మనసుకు ఆహ్లాదం కలిగించే మాట నిజం. ఆ ప్రోగ్రామ్ ముగిసిన తరవాత మనసు మామూలు స్థితికి రావడంతో ఆ కళ పని ముగిసినట్లే బావా. అందుకే కళలు తాత్కాలిక ఉపశమనంగా మిగలరాదని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలే పోరాటం చేసే విధంగా కళల్ని మార్చిన ఘనుడు రాజారావు కాగా వాటిని పోషించింది కమ్యూనిస్టు పార్టీలు. అది సరే బావా ప్రభుత్వం పౌరాణిక నాటకాలకు యిచ్చిన ప్రోత్సాహం సాంఘిక నాటకాలకు యివ్వడం లేదనే ఆరోపణలున్నాయి. నిజమే బావా ఆ ఆరోపణలు చాలా కాలంగా ఎదురవుతున్నాయి. ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రిగా వచ్చిన తరవాత ప్రతి సంవత్సరం తిరిగి స్క్రూటిని చేసి పౌరాణికాలు పన్నెండు, సాంఘికాలు పన్నెండు ఎంపిక చేసి ప్రభుత్వం ప్రదర్శనలు ఏర్పాటు చేశాయి. గత మూడు సంవత్సరాలుగా కరోనా వల్ల ఆగిపోయాయి. అయితే దాదాపు 60 పరిషత్తులలో నాటక సంస్థలు పోటీలు నిర్వహిస్తున్నారు.

అది సరే యిపుడు పౌరాణికాల ప్రదర్శనలో పాడే పద్యానికి పాడేవారికే అర్థం తెలియదు. పైగా పదం విరవటం తెలిసిన వారు తక్కువ. పద్యం ఒక నిముషమైతే రాగం పావుగంట. దీన్ని బట్టి పద్యం కంటే సంగీతానికి ప్రజలు తలలూపడం చూస్తున్నాం గదా. నిజమే బావా గతంలో పీసపాటి, రఘు రామయ్య లాంటి ఉద్దండులు పద్యం పాడితే దాని అర్థం ప్రేక్షకులకు అర్థం అయ్యేది. అనవసరంగా రాగాన్ని పొడిగించేవారు కాదు. అయినా బావ ఆ పుక్కిటి పురాణాలు ఆ నాటకాల ద్వారా యింకా ఎన్నాళ్లు ప్రజల మెదడులోకి ఎక్కించాలి చెప్పు. సమస్యలతో బతకడమే కష్టంగా ఉన్నవారికి సాంత్వనం చేకూర్చడం తాత్కాలికం. దానికంటే వారి సమస్యల పరిష్కారానికి వారే పోరాటం సలిపేందుకు వారిని చైతన్యపరిచే నాటకాలు అవసరం గదా.

అవును బావా ఆ దిశలోనే ప్రజా నాట్యమండలలు కృషి చేస్తున్నాయి. అంతేకాక నాటక రచయితలు కూడా ఎప్పటికపుడు సమాజ స్వరూపానికి అద్దం పట్టేలా సమాజంలో జరిగే అవినీతి పైన ఆర్థికంగా బలమైన వర్గం చేసే దౌర్జన్యం పీడితుల బాధలకు సంబంధించిన విషయాల పైనే రాస్తున్నారు. సమాజంలో ఉన్న వర్గ, వర్ణ వివక్ష పైన కూడ స్పందిస్తూ రచనలు చేయడం సమాజాలు ప్రదర్శించడం జరుగుతోంది. ఏదిఏమైనా గరికిపాటి ఈ విధంగా నాటకాలు తయారుచేసి నటులతో ప్రదర్శనలు యివ్వడం ద్వారా కళలు ప్రజల కోసమే అని నిరూపించాడు. ఆయన ఈ విధంగా చిరస్మరణీయుడే.

వ్యాస రచయిత సెల్ 9885569394

చెరిపినా చెరగని నెహ్రూ ముద్ర

ఆర్వీ రామారావ్

చెప్పుకోవడానికి ఏమీ లేనప్పుడు రెండు పనులు చేయొచ్చు. ఒకటి: చెప్పుకోదగిన కృషి చేసిన వారి గురించి ఆనవాలు లేకుండా చేయడం. అలాంటి వారిని ఎందుకూ కొరగాకుండా చిత్రించడం. రెండు: ఇతరుల కీర్తి ప్రతిష్ఠలను అప్పనంగా కొట్టేసి తమ ఖాతాలో వేసుకోవడానికి ఆ కీర్తిమంతుల కీర్తి గానం చేయడం. నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం, దానికి దన్నుగా ఉన్న సంఘ్ పరివార్ ఈ రెండు పనులూ చేస్తోంది. మొదటి పనికి మోదీ నెహ్రూను ఎంపిక చేసుకున్నారు. అందువల్ల ప్రతి సమస్యకూ నెహ్రూనే కారణం అని ప్రచారం చేయడం. రెండో పనికి మోదీ ప్రధానంగా సర్దార్ పటేల్ వెనకాల దాక్కోవాలని నిర్ణయించారు. నెహ్రూ కాకుండా సర్దార్ పటేల్ మొదటి ప్రధాన మంత్రి అయి ఉంటే ఎలా ఉండేది అన్న చర్చతో మొదలు పెట్టి నర్మదా నది ఒడ్డున, సర్దార్ సరోవర్ ఆనకట్టకు అభిముఖంగా 597 అడుగుల ఎత్తయిన సర్దార్ పటేల్ విగ్రహాన్ని నెలకొల్పారు. సర్దార్ పటేల్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంవల్ల పెద్ద గీత పక్కన మరీ పెద్ద గీత గీసి మునుపటి పెద్ద గీతను కురచన చేయగలిగానని మోదీ అనుకుంటున్నారు.

స్వాతంత్ర్య పోరాటంతో లేశమంత సంబంధం కూడా లేనివాళ్లు ఇప్పుడు అమృతోత్సవం అని హడావుడి చేస్తున్నారు. స్వాతంత్ర్యంసంపాదించి 75 ఏళ్లు అయింది కనక ఉత్సవాలు నిర్వహించే బాధ్యత ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం మీద ఉంటుంది. కానీ ఈ ఉత్సవాల పేరిట మోదీ సర్కారు తనకు బాగా ఇష్టమైన నెహ్రూ వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉంది. స్వాతంత్ర్య దిన అమృతోత్సవాల సందర్భంగా అధికారికంగా నిర్వహించే ఏ కార్యక్రమంలోనూ ఉదాహరణ ప్రాయంగానైనా నెహ్రూ ప్రస్తావన లేకుండా సకల జాగ్రత్తలూ తీసుకున్నారు.

మోదీ ప్రభుత్వం పనుపున జరుగుతున్న అమృతోత్సవాలలో ప్రజలు తమ ఇళ్ల మీద త్రివర్ణ పతాకాలు ఎగురవేయాలని, కిటికీలలోంచి త్రివర్ణ పతాకాలు ఊపాలని ఆదేశించారు. దీనికోసం అవసరమైన కోట్లాది త్రివర్ణ పతాకాలు తయారైంది మాత్రం చైనాలో. సర్దార్ పటేల్ విగ్రహమూ చైనాలోనే తయారైందిగా. ఆ రకంగా మోదీ ఊదరగొట్టిన భారత్‌లో తయారీ (మేక్ ఇన్ ఇండియా) నినాద ప్రాయమైందేనని మోదీ ఇతరులకు అవకాశం ఇవ్వకుండా తానే నిరూపించుకున్నారు. ఈ పతాకాలలో ఎక్కువ భాగం ప్లాస్టిక్‌తో తయారు చేసినవి కావడం మరో విచిత్రం.

నెహ్రూను నస్మరంతిగా చేయడానికి మోదీ ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. నెహ్రూకు సర్దార్ పటేల్‌తో ఉన్న భిన్నాభిప్రాయాలను వైరుధ్యాలుగా, విభేదాలుగా సృష్టించి చూపడానికి నిరంతర ప్రయత్నం కొనసాగుతూనే ఉంది. అవసరమైనప్పుడు సుభాష్ చంద్ర బోస్‌ను కూడా ఇలాగే వాడుకుంటున్నారు. అమృతోత్సవాలు ఆచరణలో మోదీ ప్రచార మంత్రాలుగా మారిపోయాయి. ఇంటింటికీ జాతీయ పతాకం ఎగురవేయాలని చెప్పడంతో పాటు సామాజిక మాధ్యమాలలో ప్రదర్శించే చిత్రాల (డిస్ప్లే పిక్చర్) స్థానంలో జాతీయ పతాకాన్ని పెట్టుకోవాలని సూచించారు. త్రివర్ణ పతాకాలే కాకుండా ఆ రంగుల్లో ఉండే అనేక వస్తువుల చిత్రాలు కూడా అమాంతం అందుబాటులోకి వచ్చేశాయి. ఈ చిత్రాలను వెబ్ సైట్ లోంచి డౌన్ లోడ్ చేసుకోవచ్చు. అయితే ఇక్కడా ఓ మతలబు ఉంది. అలా డౌన్‌లోడ్ చేసుకోవాలంటే చిరునామా, ఫోన్ నెంబర్ ఏమిటో మొదలైన వివరాలు కూడా సమకూర్చాలి. ఈ వివరాలు అన్నీ ఉంటే కానీ దేశభక్తి ప్రదర్శించడం సాధ్యం కాదు కాబోలు. జాతీయ పతాక చిహ్నాన్ని దిగుమతి చేసుకునే వెబ్ సైట్లో మోదీ ఫొటోలు దండిగా దర్శనమిస్తాయి. ముగ్గుల పోటీలు, విస్మృత వీరుల గురించిన కథనాలు, మోదీ సూక్తులు కుప్పతెప్పలుగా ఉన్నాయి. "హర్ ఘర్ తిరంగా" అనే పాటలో కూడా గత 75 ఏళ్ల కాలంలో దేశం సాధించిన విజయాలు కనిపించవు కానీ మోదీ ఆత్మకు ఇంపైన యోగ, శివుడి, సర్దార్ పటేల్ విగ్రహాలు, స్వచ్ఛ భారత్, అందులో భాగంగా బోలెడన్ని మోదీ ఫొటోలు కావల్సినన్ని ఉన్నాయి. ఈ వెబ్ సైట్లో కూడా నెహ్రూ గురించి ఏమీ లేదు. కనీసం చిన్న గీతగానైనా నెహ్రూ ఎక్కడా కనిపించదు. మోదీ, ఆయన ప్రభుత్వం దృష్టిలో నెహ్రూకు ఎలాంటి స్థానమూ లేదు.

స్వాతంత్ర్యం సిద్ధించిన తొలిఘడియల్లో నెహ్రూ చేసిన "భవిష్యత్‌తో సమా గమం-ట్రిస్ట్ విత్ దెస్టినీ" ప్రసంగాన్ని ప్రజల మెదళ్లలోంచి ఎలా చెరిపేస్తారు. ప్రపంచంలోని గొప్ప ఉపన్యాసాల జాబితాలో ఆ ప్రసంగం ఎప్పుడో చేరిపోయింది. స్వాతంత్ర్య పోరాటం అంటే స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, గౌరవం, సామాజిక సామరస్యం. ఇవి అందరికీ అందుబాటులో ఉండాలన్న ఆకాంక్ష. నెహ్రూ పాటుపడింది ఈ లక్ష్యాల సాధన కోసమే. జాతీయోద్యమానికి స్ఫూర్తి నింపిన ఈ మౌలిక సూత్రాలను మోదీ ఎలా విచ్ఛిన్నం చేస్తున్నారో చూస్తూనే ఉన్నాం. బహుశా నెహ్రూ పేరెత్తితే మోదీకి ఇవన్నీ గుర్తొచ్చి కలవర పెడ్తాయేమో. కొందరి పేర్లు చరిత్ర పుటల్లోంచి తొలగించలేం. గాంధీ, నెహ్రూ పేర్లు తొలగించడానికి వీలు కానివే. సంఘ్ పరివార్ గాంధీని హతమార్చి ఆయనను అడ్డు తొలగించుకుంది. నెహ్రూ విషయంలో అది సాధ్యం కాలేదు కనక ఆయన ఆనవాళ్లు, పాదముద్రలు చెరిపేయాలని ప్రయత్నిస్తోంది. వృథా ప్రయాస.

జాతీయ పతాకాన్ని మోదీ మాతృసంస్థ ఆర్.ఎస్.ఎస్. ఎన్నడూ గౌరవించిన పాపాన పోలేదు. 52 ఏళ్ల పాటు ఆర్.ఎస్.ఎస్. త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనే లేదు. జాతీయ పతాకంలోని రంగుల్లో సంఘ్ పరివార్‌కు ఒకే ఒక రంగు నచ్చింది. అదే కాషాయ రంగు. ఆకుపచ్చ రంగు అంటే సంఘ్ పరివార్‌కు ఒళ్లు మంట. మొత్తం కాషాయ రంగే ఉండాలని అప్పుడు ఆర్.ఎస్.ఎస్. పెద్దలు భావించారు.

అమృతోత్సవ కార్యక్రమాల్లో నెహ్రూ ప్రస్తావన లేకపోవడమే కాదు బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు రాజస్థాన్‌లో పాఠ్య పుస్తకాల్లోంచి నెహ్రూ పేరు మాయం చేశారు. వాస్తవాల ఆధారంగా చరిత్ర రాయడంకన్నా చరిత్రను చెరిపేయడం సులభం అని కాషాయ పండితులకు తెలుసు. జాతీయోద్యమలో పాల్గొన్న దిగ్గంతల పేర్లు పాఠ్య పుస్తకాల్లోంచి, ప్రభుత్వ కార్యక్రమాలలోంచి తొలగించడం సులభమే కానీ అసలు చరిత్రలో నెహ్రూ వారి లాంటి పేరు చెరిపయడం అసాధ్యం అని మోదీ సర్కారు గుర్తించకపోవడం చారిత్రక జ్ఞాన శూన్యతకు సంకేతం.

నెహ్రూ హయాంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్ముతూ నెహ్రూని మరిచిపోయేట్టు చేసే పని ఎటూ సాగుతోంది. కానీ నెహ్రూ ఏలుబడిలో నిర్మించిన భాక్రా నంగల్, నాగార్జున సాగర్ లాంటి భారీ నీటిపారుదల పథకాలను కూల్చేయలేరుగా! ఐ.ఐ.టి.లను వదిలించుకోవడం సాధ్యమేనా! మహా అయితే ప్రైవేటీకరించగలిగారేమో! కరోనా టీకాలు వేయించుకున్న సర్టిఫికేట్ల మీదే తన ఫొటోలు వేయించుకుంటే తప్ప చరిత్రలో నిలబడలేనన్న భయం మోదీకి ఉంది. నెహ్రూను కూడా అలాగే అనుకుంటున్నట్టున్నారు.

స్వాతంత్ర్యం సిద్ధించిన తొలిఘడియల్లో నెహ్రూ చేసిన "భవిష్యత్‌తో సమా గమం-ట్రిస్ట్ విత్ దెస్టినీ" ప్రసంగాన్ని ప్రజల మెదళ్లలోంచి ఎలా చెరిపేస్తారు. ప్రపంచంలోని గొప్ప ఉపన్యాసాల జాబితాలో ఆ ప్రసంగం ఎప్పుడో చేరిపోయింది. స్వాతంత్ర్య పోరాటం అంటే స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, గౌరవం, సామాజిక సామరస్యం. ఇవి అందరికీ అందుబాటులో ఉండాలన్న ఆకాంక్ష. నెహ్రూ పాటుపడింది ఈ లక్ష్యాల సాధన కోసమే. జాతీయోద్యమానికి స్ఫూర్తి నింపిన ఈ మౌలిక సూత్రాలను మోదీ ఎలా విచ్ఛిన్నం చేస్తున్నారో చూస్తూనే ఉన్నాం. బహుశా నెహ్రూ పేరెత్తితే మోదీకి ఇవన్నీ గుర్తొచ్చి కలవర పెడ్తాయేమో. కొందరి పేర్లు చరిత్ర పుటల్లోంచి తొలగించలేం. గాంధీ, నెహ్రూ పేర్లు తొలగించడానికి వీలు కానివే. సంఘ్ పరివార్ గాంధీని హతమార్చి ఆయనను అడ్డు తొలగించుకుంది. నెహ్రూ విషయంలో అది సాధ్యం కాలేదు కనక ఆయన ఆనవాళ్లు, పాదముద్రలు చెరిపేయాలని ప్రయత్నిస్తోంది. వృథా ప్రయాస.

పటేల్‌తో ప్రచారలబ్ధి సరే..ఆచరణేది?

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

పటేల్, నెహ్రూలకు భిన్నాభిప్రాయాలుండేవి. అభిప్రాయభిన్నత్వాలు కావు. వాటిని వారు నిజాయితీ, నిబద్ధతలతో అవసరమైతే గాంధీ సలహాతో చర్చించుకొని పరిష్కరించుకునేవారు. ఫలితాలను దేశ ప్రగతికి ఉపయోగించారు. షా, మోదీల మధ్య అనితరసాధ్య అపార అద్వితీయ ఏకాభిప్రాయాలు, ఐక్యతలున్నాయి. ఈ సామూహిక ప్రభావ శక్తులను దేశం కోసం వాడటంలేదు. హిందుత్వం, సంఘ్, అధికారం, కార్పొరేట్ల మేళ్ళు, సమాజ విభజన, ప్రజాస్వామ్య, లౌకిక, రాజ్యాంగ పతనాల కోసం దుర్వినియోగిస్తున్నారు. పటేల్‌ను ప్రచారానికి వాడుకుంటున్నారు. ఆయన విధానాలను పరిపాలనా పరిపూర్ణతకు వాడటంలేదు.

వల్లభ్‌భాయ్ ఝువేర్‌భాయ్ పటేలు గుజరాత్, ఖేద జిల్లా, నదియాడ్ నగరంలో పాటిదార్ కులంలో, లేవా పటేల్ ఉపకులంలో అక్టోబర్ 31, 1875న జన్మించారు. ఆయన వల్లభా చార్య పుష్టి మార్గ వైష్ణవుడు. రాజకీయవేత్త. ప్రఖ్యాత న్యాయవాది. రెండవసారి వచ్చిన తీవ్ర గుండెపోటుతో 1950 డిసెంబర్ 15న మరణించారు. పటేల్ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. అనేకమార్లు జైలుకెళ్లారు. ఆంగ్లేయులను తరమడమే ఆయన లక్ష్యం. ప్రజల ఐకమత్యం, దేశ సమైక్యత, సమగ్రతలే ధ్యేయం. నైతికత కాదని కాదు అసాధ్యమని సాయుధ తిరుగుబాటు వద్దన్నారు. స్వాతంత్ర్య సాధనకు హిందు-ముస్లిం ఐక్యత ముందస్తు అవసరం కాదన్నారు. ముస్లిం వ్యతిరేకత వల్ల తొలి ప్రధాని కాలేకపోయారు. గాంధీ, నెహ్రూలు పటేల్‌కు అన్యాయం చేశారని సంఘ్ ప్రచారం చేస్తోంది. ముస్లిం వ్యతిరేకత మూల కారణమని గుర్తించటం లేదు.

స్వాతంత్ర్య పోరాటంలో నేటి పాలకుల పాత్ర లేదు. స్వాతంత్రోద్యమ వ్యతిరేక పనులు చేశారు. ఆంగ్లేయులకు వంత పాడారు. జైలు బయటికి రావడానికి వీరి నాయకులు బ్రిటిష్ వారికి ఊడిగం చేస్తామన్న వాగ్దానంతో క్షమాయాచన ఉత్తరాలు రాశారు. భారతీయుల ఊచకోతకు ఆంగ్లేయులకు సహకరించారు. ప్రజలను మతంతో చీల్చారు. స్వాతంత్ర్య సమరంలో హిందు-ముస్లిం విభేదాలను రెచ్చగొట్టారు. ముస్లిం వ్యతిరేకతతో హిందువుల సమీకరణతో అధికారాన్ని సాధించారు. ముస్లింలను రాజకీయంగా బహిష్కరించారు.

గాంధీ తొలి రాజకీయ అనుచరులలో పటేల్ ఒకరు. బ్రిటిష్ రాజ్యానికి వ్యతిరేకంగా గాంధీ చేపట్టిన అహింసాయుత శాసనోల్లంఘనలో పాల్గొన్నారు. గుజరాత్ రైతులను, 80 వేల బర్డోలి రైతు కూలీలను ఆ ఉద్యమంలో భాగస్వాములను చేశారు. తిరుగులేని గుజరాత్ నాయకునిగా ఎదిగారు. కాంగ్రెస్ అధ్యక్షునిగా 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారు. దేశ విభజన సమయంలో శరణార్థుల కోసం సహాయక చర్యలను నిర్వహించి శాంతి పునరుద్ధరణకు కృషిచేశారు. గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమానికి పటేల్ మద్దతిచ్చారు. కుటుంబ సమేతంగా విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో పాల్గొన్నారు. గుజరాత్‌లో అసమానతలు, మద్యపానం, అస్పృశ్యత, కులమత వివక్షలకు వ్యతిరేకంగా, స్వయంసమృద్ధి, మహిళా సాధికారితకు విస్తృతంగా ఉద్యమించారు. హిందు-ముస్లిం సమస్యలు పరిష్కరించి ఐక్యతకు కృషిచేశారు. 1923లో నాగపూర్‌లో భారత పతాక ఆవిష్కరణకు దేశవ్యాపిత జనసమీకరణతో చట్టనిషేధ ఊరేగింపు తీశారు. పతాక ఆవిష్కరణకు, గాంధీతో సహా ఖైదీల విడుదలకు బ్రిటిష్ పాలకులతో చర్చలు జరిపి పరిష్కారం సాధించారు. సామాజికంగా, ఆర్థికంగా చీల్చబడ్డ కులాలు, వర్గాల ఐక్యత, విశ్వాసాలను పెంపొందించడం పటేల్ ముఖ్య విజయం.

స్వాతంత్రోద్యమంలో సంఘ్ పాల్గొన లేదు. మోదీ గుజరాత్ రైతుల భూమి లాక్కొని కార్పొ రేట్లకిచ్చారు. వాగ్దానించిన నష్టపరిహారం ఇమ్మని అడిగిన రైతులను జైళ్ళలో కుక్కారు. నేటికీ ఆ పరిహారం చెల్లించలేదు. వ్యవసాయాన్ని కార్పొరేటీకరించడానికి తన పరిధిలో లేని 3 వ్యవ సాయ చట్టాలు చేసింది మోదీ సర్కార్. 14 నెల్ల ప్రశాంత అద్భుత రైతు నిరసన లను విచ్ఛిన్నం చేయడానికి హత్యలతో సహా చాలా కుట్రలు చేసింది. చివరికి రాజకీయ లబ్ధికి విరమించింది. మరలా ఆ చట్టాలను ప్రవేశపెడతామని చిందులు తొక్కుతోంది. క్విట్ ఇండియా ఉద్యమంలో సంఘ్ పాల్గొనలేదు. తమ ప్రజాప్రతి నిధు లను పాల్గొనద్దని, వ్యతిరేకంగా ప్రచారం చేయమని ఆదేశించింది. సుభాస్ చంద్రబోస్ సైనికుల రిక్రూట్మెంట్‌ను ఆటంకపరుస్తూ ఆర్.ఎస్.ఎస్. సభ్యులను రిక్రూట్ చేసుకొని వారిని బ్రిటిష్ అధికారుల అంగరక్షక దళంలో చేర్చారు. పటేల్ ఆదర్శాలకు విరుద్ధంగా అంటరానితనం, కుల మత వివక్షలను పెంచుతున్నారు. గుజరాత్‌లోనే మద్యం, మత్తుపదార్థాలు విపరీతంగా పెరిగాయి. గుజరాత్‌లో ఆదివాసీ, గిరిజన, ముస్లిం ప్రాంతాల్లో మంచి నీరు, విద్యుత్తు, ప్రయాణ సౌకర్యాలు వంటి మౌలిక సదుపాయాలు లేవు. బర్మా నుండి వచ్చిన రోహింగ్యాలను సరిహద్దు దాటి రానివ్వలేదు. ముస్లింలపై హిందు నిప్పు రాజేశారు. దళిత, ముస్లింలను కాల్చారు. నిన్నటి దాకా సంఘ్, బిజెపి కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురవేయలేదు. చైనా బహిష్కరణ ప్రచారం చేశారు. చైనా వస్తువులు, కార్మికులతోనే బిజెపి విగ్రహాలు నిర్మించింది. మోదీ వాడేవన్నీ విదేశీ వస్తువులే. స్వయంసమృద్ధి పేరుతో విదేశీ పెట్టుబళ్ళకు, కంపెనీలకు పెద్దపీట వేశారు. అవకాశం ఉన్నా మహిళా రిజర్వేషన్‌ను పట్టించుకోలేదు.

పటేల్ అహ్మదాబాద్ మునిసిపాలిటీకి తొలి భారతీయ కమిషనర్‌గా, 1924-28 మధ్య ఎన్నికైన అధ్యక్షునిగా పనిచేశారు. విద్యుత్తు, మంచినీరు, మురుగునీటి పారుదల, పారిశుద్ధ్యం, విద్య వంటి మౌలిక సౌకర్యాలను మెరుగుపరిచారు. బ్రిటిష్ రైతు వ్యతిరేక వ్యవసాయ విధానాలు, కౌలు, పన్నులకు వ్యతిరేకంగా రైతులు, రైతు కూలీలు, కౌలు రైతుల కోసం పోరాడారు. సర్దార్ (నాయకుడు) బిరుదు పొందారు. పటేల్ అధ్యక్షతన కాంగ్రెస్ 1931లో "ప్రాథమిక హక్కులు-ఆర్థిక విధానం" ఆమోదించింది. కనీస వేతనం, హక్కులు, పౌర స్వేచ్ఛల రక్షణ, లౌకికరాజ్య స్థాపన, అంటరానితనం, బానిసత్వాల నిర్మూలనలను సూచిం చింది. యెరవడ జైల్లో పటేల్, గాంధీలు ఆప్యాయత, విశ్వాసాలతో సన్నిహిత బంధాన్ని పెంచుకున్నారు. వారి సంబంధం అన్నా (గాంధీ) తమ్ముల (పటేల్) అనుబంధంగా మారింది. గాంధీ ప్రవృత్తిని, నాయకత్వాన్ని పటేల్ గౌరవించారు. ఇద్దరూ జాతీయ, సామాజిక అంశాలపై చర్చించారు, హిందు ఇతిహాసాలు చదివారు. పటేల్ తనకు తానుగా ఒక స్థానానికి పోటీ పడకుండా, ప్రావిన్సులలో, జాతీయ స్థాయిలో ఎన్నికైన కాంగ్రెస్ సభ్యులకు మార్గదర్శకత్వం వహించారు. 1936 కాంగ్రెస్ సమావేశంలో నెహ్రూ సోషలిజం ప్రతిపాదనను పటేల్ వ్యతిరే కించారు. 1938లో గాంధీ అహింసా సూత్రాలను కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాస్ చంద్రబోస్ తిరస్కరించారు. పటేల్ బోస్‌ను వ్యతిరేకించారు. బోస్ రాజీనామాకు దారి తీసిన నిరసనలకు నాయకత్వం వహించారు.

పటేల్ తీర్మానించిన ప్రాథమిక, పౌర హక్కులు, కనీస వేతనం, లౌకిక సమాజ స్థాపన, అస్పృశ్యత నిర్మూ లన, పేదల సంక్షేమ ఆర్థిక విధానాలను మోదీ ఆచరించలేదు. కార్పొరేట్ల కొమ్ము కాశారు. అధికారం కోసం ఎంతకైనా తెగిస్తారు. సోషలిజం, అహింసలు సరిపడవు. గుజరాత్‌లోనే ఆదివాసీలకు, ముస్లింలకు మౌలిక వస తులు లేవు. గాంధీతో పటేల్ సాన్నిహిత్యం, నెహ్రూ, బోస్‌లతో భిన్నత్వాలు దేశ శ్రేయస్సుకు ఉపయోగపడ్డాయి. మోదీ-షాల భావసారూప్యం, ఐక్యతాసాన్నిహిత్యాలు విచ్ఛిన్నానికే ఉపకరించాయి.

రెండో ప్రపంచ యుద్ధం మొదలైనప్పుడు, కేంద్ర రాష్ట్రాల శాసనసభల నుండి కాంగ్రెస్‌ను ఉపసంహ రించాలనే నెహ్రూ నిర్ణయానికి, గాంధీకి విరుద్ధంగా, పటేల్ మద్దతిచ్చారు. యుద్ధానికి నైతిక వ్యతిరేకతతో బ్రిటన్‌కు మద్దతివ్వడానికి గాంధీ నిరాకరించారు. స్వాతంత్ర్యానికి బ్రిటన్ వాగ్దానం చేస్తే కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తుందని సీనియర్ నాయకుడు రాజగోపాలాచారి అన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం రాజాజీ చొరవను తిరస్క రించింది. యుద్ధం ముగియగానే ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పర్చింది. జిన్నా నేతృత్వంలో పెరిగిన ముస్లిం వేర్పాటువాద ఉద్యమానికి పరిష్కారంగా దేశ విభజనను అంగీకరించిన మొదటి కాంగ్రెస్ నాయకులలో పటేల్ ఒకరు.

(మిగతా భాగం రేపు)

వ్యాస రచయిత ప్రోగ్రెసివ్ ఫోరం
జాతీయ కార్యదర్శి, 9490204545

ఉద్యోగాల కల్పన హామీని నెరవేరుస్తాం

బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్

పాట్నా: 2020 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆర్జేడీ ప్రచారానికి నాయకత్వం వహిస్తూ తాను చేసిన 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని కొత్తగా ఏర్పాటయిన తమ ప్రభుత్వం నెరవేరుస్తుందని బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ ప్రసాద్ యాదవ్ గురువారం ప్రకటించారు. ఉద్యోగాల కల్పనకు 'అత్యున్నత ప్రాధాన్యత' ఇవ్వాలని సంబంధిత అధికారులకు తన బాస్ నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకారానికి ముందురోజు అధికారులను ఆదేశించారని తేజస్వి తెలిపారు. బీహార్ సీఎంగా జేడీయూ నేత నితీశ్ కుమార్ బుధవారం ఎనిమిదోసారి ప్రమాణ స్వీకారం చేశారు. నితీశ్ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏతో సంబంధాలను తెంచుకుని, ఆర్‌జేడీ, కాంగ్రెస్‌తో సహా ఇతర ప్రతిపక్ష పార్టీలతో చేతులు కలిపి 'మహాఘట్‌బంధన్' ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఒక రోజు తర్వాత ఈ పరిణామం జరిగింది. 'ప్రభుత్వ శాఖల్లో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మేము వీటిని పూరించడం ద్వారా ప్రారంభిస్తాము. అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకున్న తర్వాత మేము పూర్తిగా పని చేసేంత వరకు మాత్రమే' అని తేజస్వి ఒక వార్తా ఛానెల్‌తో అన్నారు. ఇది కేవలం వాగ్దానం మాత్రమే కాదు, బీహార్‌లో ఉపాధి కల్పన కోసం ఆవశ్యకతను అంగీకరించడం అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. 'ఎన్‌డీఏ కంటే మొత్తం 243 అసెంబ్లీ సీట్లలో ఆర్‌జేడీ నేతృత్వంలోని కూటమి కేవలం 12 వేల ఓట్లు మాత్రమే తక్కువ సాధించిన ఎన్నికలలో ప్రజలు తమ ఆశీర్వాదాలను కురిపించినందున మేము తిరిగి వెళ్లడం గురించి ఆలోచించలేదు' అని ఆయన గుర్తు చేసుకున్నారు. కేంద్రంలోని అధికార బీజేపీ తరచూ కండబలాన్ని ఉపయోగించిందని, ఫలితంగా శాంతిభద్రతలు క్షీణించాయని ఆర్‌జేడీ నాయకుడు ఆరోపించాడు. 'సమస్య ఏమిటంటే, మనకు మనం ప్రచారం చేసుకోవడం ఎలాగో తెలియదు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రచారంలో నిష్ణాతులు. కానీ మా ప్రభుత్వ పనితీరును ప్రజలు ఒకసారి చూస్తే వారి ఆరోపణలను గమనిస్తారు' అని తెలిపారు. కూటమి భాగస్వామ్యపక్షంగా ఉన్నప్పటికీ బీజేపీ చీల్చేందుకు ప్రయత్నిస్తోందన్న జేడీ(యూ) వాదనతో ఏకీభవించారు. 'నితీశ్ కుమార్ జీ చాలా ఒత్తిడిలో ఉన్నారు. వారు (బీజేపీ) అన్ని రాష్ట్రాల్లో ఏమి చేశారో బీహార్‌లో చేయాలని ప్రయత్నిస్తున్నారు. బెదిరించండి లేదా డబ్బుతో ఎర వేయడం' అని అన్నారు. 'అధికారం పంచుకుంటున్నప్పుడు, పాట్నా విశ్వవిద్యాలయానికి కేంద్ర హోదా వంటి చిన్న అభ్యర్థనలను కూడా బీజేపీ ఆమోదించలేదు. వీటిని ప్రజల దృష్టిలో ఉంచాలని నితీశ్ కుమార్ జీని ప్రధానిని కోరారు. ప్రత్యేక హోదా, ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ, వరద బాధిత ప్రాంతాలకు ప్యాకేజీ గురించి మరచిపోండి' అని అన్నారు. 'ఇటీవల నితీశ్ కుమార్ జీని నిజమైన సోషలిస్టు అని పిలిచింది ప్రధానమంత్రి కాదా?' అని సీఎం ఇప్పుడు సైద్ధాంతిక సహచరులతో కలిసి ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్నందుకు ఆయన సంతోషించాలి' అని తేజస్వి వ్యాఖ్యానించారు. 'మనమంతా హృదయపూర్వకంగా సోషలిస్టులం. మేము పోరాడవచ్చు. కానీ మేము కలిసి ఉంటాము' అని చెప్పారు. 'లాలూ ప్రసాద్‌తో నితీశ్ కుమార్ చేతులు కలిపినప్పుడే మహాఘట్‌బంధన్ అనే పదం వచ్చింది. ఆయన మాతో తిరిగి వచ్చినందుకు మేము చాలా సంతోషంగా ఉన్నాము' అని 2015 అసెంబ్లీ ఎన్నికల్లో అరంగేట్రం చేసి, మహాకూటమి ప్రభుత్వానికి ఉప ముఖ్యమంత్రి అయిన 33 ఏళ్ల నాయకుడు అన్నారు.

నా నివాసంలో ఈడీ, సీబీఐ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవచ్చు

ఈడీ, సీబీఐకి భయపడాల్సిన అవసరం లేదని, ఇది శాంతిని తీసుకువస్తే తన నివాసంలో కార్యాలయాలను ఏర్పాటు చేయడానికి ఆ దర్యాప్తు సంస్థలను అనుమతించడానికి సిద్ధంగా ఉన్నానని తేజస్వి అన్నారు. ఆర్‌జేడీ నాయకుడు తన తల్లి, మాజీ ముఖ్యమంత్రి రబ్రీ దేవి ఇంట్లో జర్నలిస్టులతో మాట్లాడుతున్నప్పుడు బీజేపీకి చెందిన రాజకీయ ప్రత్యర్థులపై కేంద్ర దర్యాప్తుల సంస్థలను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. 'ఇది కూడా శాంతిని తీసుకురాకపోతే నేను సహాయం చేయలేను' అని అన్నారు. తాను ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మొదటి హయాంలో 'ఈ సంస్థలకు' భయపడలేదని పేర్కొన్న యాదవ్, తాను బీహార్ ప్రయోజనాల కోసం కేంద్రంతో పోరాడుతున్నానని చెప్పారు.

ఈ తిండి జంతువులు కూడా తినవు

విలపించిన యూపీ పోలీస్ కానిస్టేబుల్

లక్నో: బీజేపీ పాలిత ఉత్తర ప్రదేశ్‌లో పోలీసుల దయనీయ పరిస్థితి బయటపడింది. మెస్ ఫుడ్ నాణ్యతపై ఒక కానిస్టేబుల్ బోరున విలపించాడు. తమకు ఇచ్చే ఆహారాన్ని జంతువులు కూడా తినలేవని చెప్పాడు. యూపీలోని ఫిరోజాబాద్ జిల్లాలో బుధవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. కానిస్టేబుల్ మనోజ్ కుమార్ అక్కడి మెస్ ఫుడ్‌పై ఆవేదన వ్యక్తం చేశాడు. రోటీలు, దాల్ ప్లేట్ పట్టుకున్న అతడు దానిని అక్కడున్న వారికి చూపించి బోరున విలపించాడు. రోటీలను సరిగా కాల్చలేదని, పప్పు నీళ్లగా ఉందని, అన్నం ఉడకలేదని తెలిపాడు. పోలీసు సిబ్బందికి పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భృతిని అందజేస్తున్నట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గతంలో ప్రకటించారని కానిస్టేబుల్ మనోజ్ కుమార్ గుర్తు చేశాడు. చాలా గంటలు డ్యూటీ చేసిన తర్వాత తమకు లభించే ఫుడ్ ఇదేనని, జంతువులు కూడా తినలేవంటూ విమర్శించాడు. సరైన ఆహారం లేకపోతే పోలీసులు ఎలా డ్యూటీ చేస్తారు? అని ప్రశ్నించాడు. మెస్ ఫుడ్ నాణ్యతను ప్రశ్నించినందుకు జాబ్ నుంచి తొలగిస్తామంటూ తనను బెదిరిస్తున్నారని వాపోయాడు. అక్కడున్న పోలీస్ అధికారి విలపిస్తున్న ఆ కానిస్టేబుల్‌ను సముదాయించేందుకు ప్రయత్నించాడు. మరోవైపు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఫిరోజాబాద్ పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. కానిస్టేబుల్ మనోజ్ కుమార్ తరచుగా క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అతడి అక్రమాలు, క్రమశిక్షణా రాహిత్యానికి సంబంధించి గతంలో 15 సార్లు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తాజా ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ట్విట్టర్ ద్వారా వెల్లడించారు.

ముఖ్యమంత్రి మార్పు లేదు

బెంగళూరు: బీజేపీ అధిష్ఠానం కర్ణాటక ముఖ్యమంత్రిని మార్చనుందంటూ కొద్దిరోజులుగా ఆ రాష్ట్రంలో విస్తృత చర్చ సాగుతోంది. సొంత పార్టీకి చెందిన కొంతమంది నేతల వ్యాఖ్యలే ఇందుకు ప్రధాన కారణం. కొద్దిరోజుల క్రితం కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం ఉన్నపళంగా కర్ణాటకకు వెళ్లి స్థానిక నేతలతో చర్చలు జరపడంతో ఈ ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. ఆగస్టు 15వ తేదీ నాటికి సీఎం మారనున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే కొందరు నేతలు మాత్రం అలాంటిదేమీ లేదంటున్నారు. అవి కేవలం పుకార్లేనని కొట్టిపడేస్తున్నారు. దక్షిణ కన్నడ జిల్లాకు చెందిన బీజేపీ యువనేత దారుణ హత్య అనంతరం ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఇరకాటంలో పడ్డారు. హత్య, తదుపరి పరిణామాల నేపథ్యంలో సీఎం బొమ్మైపై బీజేపీ అధిష్ఠానం గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. సొంత పార్టీ నేతలనే కాపాడుకోలేకపోతున్నారని.. దీనికితోడు మరికొన్ని విషయాల్లోనూ అధిష్ఠానం అసంతృప్తిగా ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతుండటంతో సీఎం మార్పుపై గుసగుసలు మొదలయ్యాయి. దీనికితోడు పార్టీ నేత బాసనగౌడ పాటిల్ కొద్దిరోజుల క్రితం ఈ అంశంపై మాట్లాడుతూ 'హైకమాండ్‌కు ఏది ఉత్తమం అనిపిస్తే అదే చేస్తుంది' అని పేర్కొనడం గమనార్హం. మరో సీనియర్ నేత బి.సురేశ్ గౌడ సైతం బాసనగౌడ పాటిల్ తరహా వ్యాఖ్యలే చేశారు. 'ఎన్నికలకు ఇంకా ఆరు, ఏడు నెలలు మాత్రమే ఉంది. ఇలాంటి సమయంలో గతంలోనూ ముఖ్యమంత్రి మార్పులు జరిగాయి. ఇప్పుడు కూడా అలాంటిది జరిగే అవకాశం లేకపోలేదు' అని అనడం ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసినట్లయింది. 'వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సహాయానికి బదులు బీజేపీ హైకమాండ్ కర్ణాటకలో మూడో వ్యక్తిని ముఖ్యమంత్రిగా నియమించే ప్రయత్నాలు చేస్తోంది' అంటూ రాష్ట్ర కాంగ్రెస్ సైతం ట్వీట్ చేసింది. గతే ఏడాది జులైలో సీఎంగా ఉన్న యడియూరప్పను తొలగించి బొమ్మైకి ఆ పదవి అప్పగించిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది మే నెలలో కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు ముందు నాయకత్వ మార్పు అనేది బీజేపీకి కొత్తేమీ కాదు. అయితే రాష్ట్ర బీజేపీ యూనిట్ అధ్యక్షుడు నలిన్ కుమార్ కటీల్, ఆర్థిక మంత్రి ఆర్.అశోక్ సహా పలువురు సీనియర్ నేతలు మాత్రం ఇవి పుకార్లేనంటూ కొట్టిపడేస్తున్నారు. బొమ్మై తన పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తిచేస్తారని పేర్కొంటున్నారు. యడియూరప్ప మార్గనిర్దేశంలో బొమ్మై నాయకత్వంలోనే తదుపరి ఎన్నికలు జరుగుతాయని కటీల్ అన్నారు. బొమ్మైకి అత్యంత విధేయుడైన విద్యాశాఖ మంత్రి అశ్వత్ నారాయణ్ సైతం స్పందించారు. కాంగ్రెస్ పార్టీనే ఇలాంటి పుకార్లు పుట్టిస్తోందని ఆరోపించారు.

వరద బీభత్సం

- అనేక రాష్ట్రాల్లో ఉప్పొంగుతున్న నదులు, కాలువలు
- విరిగి పడిన కొండ చరియలు
- నలుగురి మృతి... మరో నలుగురు గల్లంతు
- కొట్టుకుపోయిన ఏటీఎం, వాహనాలు
- జన జీవనం అస్తవ్యస్తం

న్యూఢిల్లీ: దేశంలోని వివిధ రాష్ట్రాలను భారీ వర్షాలు, వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తరకాశీ జిల్లాలో వరద ఉధృతికి ఏటీఎం వరదల్లో కొట్టుకుపోయింది. కుమోలో నది వర్షాలకు ఉప్పొంగి ప్రవహిస్తోంది. పురోలాలో నది ఒడ్డున 8 దుకాణాలు, ఏటీఎం వున్నాయి. వరదల కారణంగా అవన్నీ కొట్టుకుపోయాయి. ఏటీఎంలో రూ.24 లక్షల నగదు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. బుధవారం సాయంత్రమే ఇందులో నగదును డిపాజిట్ చేశారు అధికారులు. బుధవారం రాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి కుమోలో నదిలో ప్రవాహం పెరిగి వరదలకు దారి తీసింది. వరద ఉధృతి కొనసాగుతుండటంతో సమీపంలోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు.

– హిమాచల్ ప్రదేశ్‌లోని చంబా జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరద సంభవించింది. కొండ ప్రాంతమైన అన్నే తహసీల్‌లోని ద్యుతీ గ్రామ పంచాయతీలో ఉదయం 7.30 గం.ల సమయంలో మేఘ విస్ఫోటనం కారణంగా ఆకస్మిక వరద పోటెత్తి జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. భారీ ఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. రహదారులు, వంతెనలు దెబ్బతిన్నాయి. నదులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్నాయి. అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. కులు జిల్లా షీల్ గ్రామ పంచాయతీ ఖదేల్ గ్రామంలో గురువారం ఉదయం 9 గంటలకు ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో ఇద్దరు మహిళలు చవేలు దేవి (55), కృతిక (17) శిథిలాల కింద చిక్కుకుని మృతిచెందారు.

– జమ్మూకశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలో గురువారం ఇద్దరు మహిళలు ఆకస్మిక వరదల్లో కొట్టుకుపోయారు. మెహార్‌లో ఈ సంఘటన జరిగింది. బాధితులను షమీమా బేగం, రోజియా బేగంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఇద్దరూ చనిపోయి ఉంటారని అధికారులు పేర్కొన్నారు. పోలీసులు, సైన్యం వీరిద్దరి జాడ కోసం గాలింపు జరుపుతున్నాయి. కాగా కొన్ని కార్లు, మోటార్ సైకిళ్ల కూడా వరదలో కొట్టుకుపోయాయని వారు తెలిపారు.

– మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో భారీ వర్షాల కారణంగా ఉప్పొంగిన కాలువల్లో ముగ్గురు వ్యక్తులు గల్లంతయ్యారు. మధ్య ప్రదేశ్

ఇండోర్ నగరంలో కాలువల్లో ఇద్దరు వ్యక్తులు కొట్టుకుపోయారు. సిర్పూర్ ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం జకీర్ ఖాన్ (24) అనే వ్యక్తి, ప్రమాదవశాత్తూ డ్రెయిన్‌లో పడిపోయాడు. అలాగే బంగంగ ప్రాంతంలో దుర్గా జైస్వాల్ (26) అనే మహిళ, పొంగిపొర్లుతున్న కాలువలో కొట్టుకుపోయింది. మహారాష్ట్రలోని గోండియా జిల్లాలో ముగ్గురు వ్యక్తులతో వెళ్తున్న ఎస్‌యూవీ... బుధవారం రాత్రి కిడాంగిపార్ వద్ద కాలువలోపడి కొట్టుకుపోయిందని జిల్లా విపత్తు నిర్వహణ అధికారి (డీడీఎంవో) రాజన్ చౌబే తెలిపారు. ఆ తర్వాత ఇద్దరు వ్యక్తులను రక్షించామని, మూడో వ్యక్తి ఆచూకీ కోసం గాలింపు చేపట్టినట్లు తెలిపారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలోని కొన్ని నదులు పొంగిపొర్లాయని, భండారా, చంద్రపూర్‌కు చెందిన పలువురిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. విదర్భ ప్రాంతంలో ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. భారీ వర్షాల కారణంగా పంటలకు భారీ నష్టం వాటిల్లిందని, అంచనా సర్వే కొనసాగుతున్నదని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు.

పీఎంవో సిబ్బంది కుమార్తెలతో మోదీ రక్షాబంధన్

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ తన కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది కుమార్తెలతో కలిసి గురువారం రక్షాబంధన్ జరుపుకున్నారు. 'ఈ చిన్నారులతో చాలా ప్రత్యేకమైన రక్షా బంధన్' అని ప్రధాని ట్వీట్ చేసి ఆ కార్యక్రమం చిత్రాలను పోస్టు చేశారు. ప్రధాని కార్యాలయంలో పనిచేస్తున్న స్వీపర్లు, ప్యూన్లు, తోటమాలి, డ్రైవర్లు, ఇతర సిబ్బంది కుమార్తెలు మోదీకి రాఖీలు కట్టారని అధికారులు తెలిపారు. వారు వేడుకల వీడియోను పంచుకున్నారు.

బొగ్గు స్మగ్లింగ్ కేసులో 8 మంది అధికారులకు ఈడీ సమన్లు

కోల్‌కతా : బొగ్గు అక్రమ రవాణా కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎనిమిది మంది పోలీసు ఉన్నతాధికారులను విచారణ నిమిత్తం న్యూఢిల్లీకి పిలిపించినట్లు అధికారులు గురువారం తెలిపారు. కేంద్ర దర్యాప్తు సంస్థ సమన్లు జారీ చేసిన ఐపీఎస్ అధికారుల్లో జ్ఞానవంత్ సింగ్ (ఏడీజీ, సీఐడీ), కోటేశ్వరరావు, ఎస్.సెల్వమురుగన్, శ్యామ్ సింగ్, రాజీవ్ మిశ్రా, సుకేష్ కుమార్ జైన్, తథాగత బసు ఉన్నారని వారు తెలిపారు. న్యూఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో ఐపీఎస్ అధికారులు హాజరయ్యేందుకు నిర్దిష్ట తేదీలు ఇచ్చామని వివరించారు. 'బొగ్గు అక్రమ రవాణా కేసులో ఈ ఐపీఎస్ అధికారులు కీలక పాత్ర పోషించారు. ఈ కుంభకోణంలో ఈ అధికారులు లబ్ధి పొందినట్లు ఆధారాలు ఉన్నాయి. వీరంతా స్మగ్లింగ్ జరిగిన ప్రాంతాల్లోనే నియమితులయ్యారు' అని ఈడీ అధికారి తెలిపారు. ఈ ఎనిమిది మంది అధికారుల్లో ఏడుగురికి గత ఏడాది కూడా ఈడీ సమన్లు జారీ చేసింది.

కార్పొరేట్లకు రుణ మాఫీ...పేదలకు పన్నుల భారం

మోదీ సర్కార్‌పై కేజ్రీవాల్ ఆగ్రహం

న్యూఢిల్లీ : ఉచిత పథకాలను వ్యతిరేకిస్తున్న కేంద్రం తీరును దుయ్యబడుతూ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కాషాయ సర్కార్ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ సంపన్నుల రుణాలను రూ 10 లక్షల కోట్లు మాఫీ చేసిన కేంద్రం మరోవైపు పేదలపై పన్ను భారాలు మోపుతోందని కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బియ్యం, గోధుమలను కొనుగోలు చేసే వ్యాపారి, నిరుపేద సైతం పన్ను చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు.

అత్యంత పేదలపైనా పన్ను భారం మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా తగ్గింపు, ఆహారోత్పత్తులపై జీఎస్టీ, జాతీయ ఉపాధి హామీ పథకంలో 25 శాతం కోత విధించడం ద్వారా సమకూరిన నిధులు ఏమవుతున్నాయని కేజ్రీవాల్ ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ ద్వారా ఏటా రూ 3.5 లక్షల కోట్లు కేంద్రం వసూలు చేస్తోందని మరోవైపు సైనికులకు పెన్షన్ చెల్లించేందుకు కూడా నిధుల లేమిని సాకుగా చూపుతోందని కేజ్రీవాల్ దుయ్యబట్టారు.

జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు ఎందుకు లేవు...?

కేంద్రాన్ని వివరణ కోరిన సీపీఎం నేత తారిగామి

శ్రీనగర్ : దేశ ప్రజలను విశ్వాసంలోకి తీసుకుని జమ్మూకశ్మీర్‌లో ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీ ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదో వివరించాలని సీపీఎం నేత మహ్మద్ యూసుఫ్ తారిగామి గురువారం కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన కేంద్రపాలిత ప్రాంతం కింద జమ్ముకశ్మీర్‌లోని అన్ని 'అనారోగ్యాలకు' ఎన్నికలు దివ్యౌషధం కానప్పటికీ, ఎన్నికయిన ప్రభుత్వం ప్రజలకు కొంత విశ్రాంతిని అందిస్తుందని ఆయన అన్నారు. 'జమ్ముకశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొని ఉన్నాయని, అన్ని తప్పులు సరిచేశామని కేంద్రంలోని ప్రస్తుత ప్రభుత్వం గొంతు చించుకుంది. అలాంటప్పుడు, ఎన్నికలను ఎందుకు ఆలస్యం చేస్తున్నారు?' అని గుప్కార్ డిక్లరేషన్ కోసం పీపుల్స్ అలయన్స్ ప్రతినిధి కూడా అయిన తారిగామి ప్రశ్నించారు. ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్న మొదటి సాకు.. వారి అజెండాను అనుసరించడానికి నియోజకవర్గాలను పునర్నిర్మించే సమయంలో వారు హరాకిరి (ఆత్మహత్య)కు పాల్పడ్డారు. అప్పుడు కూడా ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదని ఆయన అన్నారు. జమ్ముకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించడమే కాకుండా రాష్ట్ర హోదాను పునరుద్ధరించేందుకు కూడా కట్టుబడి ఉన్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభా వేదికపై చెప్పారని తరిగామి అన్నారు. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేని పక్షంలో అలా చేయకపోవడానికి గల కారణాలను దేశ ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) నాయకుడు ఒమర్ అబ్దుల్లా బుధవారం మాట్లాడుతూ ఆర్టికల్ 370ని రద్దు చేసి, డీలిమిటేషన్ కమిషన్ ద్వారా నియోజకవర్గాలను 'జెర్రిమాండరింగ్' (ఒక పార్టీ లేదా వర్గానికి అనుకూలంగా ఉండేలా ఎన్నికల నియోజకవర్గం సరిహద్దులను మార్చడం), భద్రతను రద్దు చేయడం ద్వారా జేకేఎన్‌సీ వంటి పార్టీల కదలిక, కార్యకలాపాలను తగ్గించడం చేసిన తర్వాత కూడా ఓటర్లను ఎదుర్కొనే ధైర్యం బీజేపీకి లేదని ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నవంబర్ 25వ తేదీని తుది ఓటర్ల జాబితాను ప్రచురించడానికి తేదీగా నిర్ణయించినందున జమ్ముకశ్మీర్‌లో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం లేదు.

28న ఢిల్లీలో కాంగ్రెస్ భారీ ర్యాలీ

న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని రాంలీలా మైదానంలో ఆగస్టు 28న ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ 'మెహంగై పర్ హల్లా బోల్'పేరుతో భారీ ర్యాలీ నిర్వహించనుంది. రానున్న వారాల్లో ధరల పెరుగుదల, నిరుద్యోగంపై పోరాటాన్ని వరుస నిరసన కార్యక్రమాలతో ముందుకు తీసుకెళ్లనున్నట్లు పార్టీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 2022 ఆగస్టు 17 నుంచి 23 వరకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మండీలు, రిటైల్ మార్కెట్‌లు, ఇతర ప్రదేశాలలో కాంగ్రెస్ పార్టీ 'మెహంగై చౌపాల్' పేరుతో సమావేశాలను నిర్వహిస్తుంది. ఆగస్టు 28న 'మెహంగై పర్ హల్లా బోల్' ర్యాలీతో పూర్తవుతుంది. న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. కాగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలు, రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయిలలో ఏకకాలంలో 'మెహంగై పర్ హల్లా బోల్–చలో ఢిల్లీ' కార్యక్రమాలను పార్టీ శ్రేణులు నిర్వహిస్తాయని జైరాం రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. మోదీ సర్కారు ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆగస్టు 5 న నిర్వహించిన దేశవ్యాప్త ఆందోళనతో పార్టీ ప్రజల్లోకి బలంగా వెళ్తోందని జైరామ్ రమేశ్ తెలిపారు. మోదీ ప్రభుత్వ ఆర్థిక దుర్వినియోగం వల్ల భారత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పేర్కొంది. పెరుగు, మజ్జిగ, ప్యాకేజ్డ్ ఫుడ్‌గ్రెయిన్స్ వంటి నిత్యావసర వస్తువులపై అధిక పన్నులతో ద్రవ్యోల్బణం పెరిగిపోతోందని, ప్రభుత్వ ఆస్తులను ఆప్తులైన పెట్టుబడిదారులకు బదిలీ చేయడం, యువతను తప్పుదారి పట్టించే అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టడం వల్ల ఉపాధి పరిస్థితి మరింత దిగజారిందని జైరాం పేర్కొన్నారు. 'భారత జాతీయ కాంగ్రెస్ ఈ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల్లో అవగాహనను పెంచుతూనే ఉంటుంది. దుష్ట మార్గాన్ని మార్చుకునేలా బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతుంది' అని ఆయన అన్నారు.

పశువుల అక్రమ రవాణా కేసు

టీఎంసీ కీలక నేత అనుబ్రతా మండల్ అరెస్టు

- ఇంట్లోకి వచ్చి అదుపులోకి తీసుకున్న సీబీఐ
- అనుచరుల ఇళ్లపైనా దాడులు

బోల్‌పూర్: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అత్యంత సన్నిహితుడు, బీర్భూం జిల్లా టీఎంసీ అధ్యక్షుడు అనుబ్రతా మండల్‌ను గురువారం సీబీఐ అరెస్టు చేసింది. 2020 నాటి పశువుల అక్రమ రవాణా కేసు విచారణలో భాగంగా బోల్‌పూర్‌లోని ఆయన నివాసంలో అనుబ్రతను సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు, బొగ్గు కుంభకోణంలో ఎనిమిది మంది ఐపీఎస్ అధికారులకు ఈడీ సమన్లు జారీ చేసింది. పశువుల అక్రమ రవాణా కేసు విచారణలో భాగంగా గురువారం ఉదయం అనుబ్రత నివాసానికి పెద్ద సంఖ్యలో సీబీఐ అధికారులు చేరుకున్నారు. వారి వెంట 30 కార్ల కాన్వాయ్ కూడా వచ్చింది. ఆయన్ను ఓ గదిలో ఉంచి గంటన్నరకు పైగా ప్రశ్నించారు. ఈ కేసులో మండల్ విచారణకు సహకరించకపోవడంతో అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారులు చెబుతున్నారు.

పశువుల అక్రమ రవాణా కేసుకు సంబంధించి అనుబ్రతకు 10 సార్లు సమన్లు జారీ చేసినట్లు తెలిపారు. అనారోగ్య కారణాలతో సోమ, బుధ వారాల్లో మండల్ విచారణకు గైర్హాజరయ్యారు. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితి ఏమీ లేదని కోల్‌కతాకు చెందిన ఎస్‌ఎస్‌కేఎం ఆసుపత్రి వెల్లడించడంతో అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. మండల్‌కు 14 రోజుల పాటు విశ్రాంతి అవసరమని సిఫార్సు చేసిన బోల్‌పూర్ వైద్యుడిని కూడా ప్రశ్నిస్తామని సీబీఐ తెలిపింది. తొలుత సీబీఐ అధికారుల రాకను గమనించిన అనుబ్రత... తన నివాసం రెండో అంతస్తులో ఉన్న గదికి వెళ్లి, లోపలి నుంచి తాళం పెటుకున్నారు. అరెస్టు మెమోపై సంతకం చేయడానికి కూడా ఆయన నిరాకరించారు. చివరకు పారా మిలిటరీ సిబ్బంది వచ్చి తలుపులు పగలగొడతారని హెచ్చరించగా, గది బయటకు వచ్చారని సంబంధిత వర్గాలు తెలిపాయి. విచారణ అనంతరం

అనుబ్రతను ఆసనోల్ కోర్టులో హాజరుపర్చనున్నట్లు సీబీఐ అధికారులు పేర్కొన్నారు. కాగా అనుబ్రత సన్నిహితుల ఇళ్లపై కూడా దాడులు నిర్వహిస్తున్నారని ఒక సీబీఐ అధికారి తెలిపారు.

నిశితంగా పరిశీలిస్తున్నాం: టీఎంసీ

అనుబ్రత అరెస్టు, అనంతర పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు టీఎంసీ పేర్కొంది.

"పార్టీ సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటుంది. అయితే, టీఎంసీ... అవినీతికి సంబంధించిన ఏ విషయంలోనూ రాజీపడదని మేము స్పష్టం చేయాలనుకుంటున్నాం' అని టీఎంసీ ఎంపీ శాంతానుసేన్ తెలిపారు. అవినీతి, అక్రమాలను పార్టీ ఏమాత్రం సహించదన్నారు.

అవినీతి ఊబిలో టీఎంసీ: బీజేపీ

కాగా మండల్ అరెస్టు... అధికార టీఎంసీ అవినీతిలో కూరుకుపోయిందనడానికి ప్రత్యక్ష నిదర్శనమని ప్రతిపక్ష బీజేపీ ఆరోపించింది. దీనిపై వెంటనే ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటన చేయాలని డిమాండ్ చేసింది. 'మండల్ అరెస్టుపై సీఎం ప్రకటన చేయాల్సిన సమయం ఇది. అతను టీఎంసీ అగ్ర నాయకత్వానికి సన్నిహితంగా ఉన్నాడని మనందరికీ తెలుసు' అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు దిలీప్ ఘోష్ అన్నారు. సీపీఎం నాయకుడు సుజన్ చక్రవర్తి బీర్భూమ్ జిల్లాలో మండల్ తనను తాను చట్టానికి అతీతంగా భావించారని , అతని దుశ్చర్యలకు టీఎంసీ నాయకత్వం కళ్లు మూసుకుందని పేర్కొన్నారు.

విద్యతోనే మెరుగైన జీవితం

- సీఎం వైఎస్ జగన్
- 3వ విడత 'విద్యా దీవెన' నిధుల విడుదల

విశాలాంధ్ర-బాపట్ల: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గురువారం జగనన్న విద్యాదీవెన 3వ విడత నిధులను లబ్ధిదారుల ఖాతాల్లోకి విడుదల చేశారు. బాపట్లలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఈ కార్యక్ర`మం నిర్వహించారు.తొలుత సీఎం వైస్ జగన్... వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత ఆన్ లైన్ ద్వారా రూ.694 కోట్లను 11.2 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు విడుదల చేశారు. అనంతరం జరిగిన సభలో సీఎం జగన్ మాట్లాడుతూ... విద్యార్థినులు, మహిళలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పేదల బతుకులు ఆర్థికంగా ఎదగడానికి విద్య దోహదం చేస్తుందని, ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా చదివించేందుకు వెనకాడవద్దని, అందరినీ చదివిస్తానని ఒక అన్నగా తమ్ముడుగా హామీ ఇస్తున్నానన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ, ముస్లిం మైనార్టీ పేద విద్యార్థులు పెద్ద చదువులు చదివేందుకు ప్రభుత్వం ఆర్థికంగా చేయూత ఇస్తుందన్నారు. రోజు రోజుకు సమాజంలో మారుతున్న స్థితిగతులకు అనుగుణంగా విద్యార్థుల తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు ఉండాలన్నారు. నేటి తరానికి మెరుగైన విద్యాఫలాలు అందిస్తున్నామన్నారు. పిల్లలను చదివించడానికి ఇళ్లు, పొలాలు అమ్ముకొని అప్పులు పాలయ్యే పరిస్థితులు మారాలని దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన అమలు చేస్తున్నా మని తెలిపారు. పేదల ఇంటింటా వెలుగులు నింపాలని నవరత్నాలు అమలు చేస్తున్నామన్నారు. పేదల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని అడుగు లైనా ముందుకు వేస్తుందని ఆయన చెప్పారు. బాపట్ల జిల్లా నూతన కలెక్టరేట్‌ను 50 ఎకరాలలో నిర్మించ డానికి పంపిన ప్రతిపాదనను ఆమోదిస్తూ అభివృద్ధికి నాంది పలుకుతున్నామని సీఎం ప్రకటించారు. బాపట్లలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అదనపు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణానికి రూ. 18 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. పేరలి కాల్వ హెడ్ రెగ్యులేటర్ నిర్మాణానికి అధికారికంగా ఆమోదం తెలుపుతున్నామన్నారు. బాపట్ల మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్యతో విద్యార్థుల జీవితాలు ప్రకాశించబోతున్నాయని చెప్పారు. ఉపసభాపతి కోన రఘుపతి మాట్లాడుతూ బాపట్లను నూతన జిల్లాగా చేయాలనే ప్రజల ఆకాంక్ష లను ముఖ్యమంత్రి అమల్లోకి తెచ్చి కలను సాకారం చేశారని తెలిపారు. విద్యా కేంద్రంగా పేరుగాంచిన బాపట్లను వైద్య కేంద్రంగాను మార్చేలా రూ.510 కోట్లతో వైద్య కళాశాల, 500 పడకలతో ఆసుపత్రిని మంజూరు చేశారని చెప్పారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ... నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లా సర్వతోముఖాభివృద్ధికి జిల్లా యంత్రాంగం సమిష్టిగా కృషిచేస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఆకాంక్ష లకు అనుగుణంగా అధికారులంతా పనిచేస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్య మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, ఎంపీ నందిగాం సురేష్, శాసన మండలి సభ్యులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పోతుల సునీత, గుంటూరు జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టియానా, ప్రకాశం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతిగా ధన్కర్ బాధ్యతలు

న్యూఢిల్లీ: భారతదేశ 14వ ఉపరాష్ట్రపతిగా జగదీప్ ధన్కర్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన క్లుప్త కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము... ధన్కర్ (71)తో ప్రమాణం చేయించారు. ఆయన హిందీలో ప్రమాణం చేశారు. ధన్కర్ ప్రమాణ స్వీకార రిజిస్టర్‌పై సంతకం చేసిన తర్వాత 'బహుత్-బహుత్ బధై (అనేక అభినందనలు) ముర్ము అన్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు ధన్కర్‌కి ఎన్నికల సంఘం జారీ చేసిన ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.హమీద్ అన్సారీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ తదితరులు పాల్గొన్నారు. ఉదయం మహాత్మా గాంధీ స్మారక స్థూపం రాజ్ ఘాట్ వద్ద ధన్కర్ నివాళులర్పించారు. 'పూజ్య బాపుకి నివాళులు అర్పిస్తూ, రాజ్ ఘాట్ నిర్మలమైన ఘనతలో భారతదేశ సేవలో ఎప్పుడూ ఉండాలనే ఆశీర్వాదం, ప్రేరణ కలిగింది' అని ఆయన ట్వీట్ చేశారు. పశ్చిమ బెంగాల్ రాజ్ భవన్ వెబ్‌సైట్‌లో ఆయన జీవిత చరిత్ర ప్రకారం, ధన్కర్ మే 18, 1951న రాజస్థాన్‌లోని ఝుంఝును జిల్లాలోని కితానా గ్రామంలో జన్మించారు. ఆయన గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యను అభ్యసించారు. తరువాత పూర్తి ఉపకారవేతనంతో చిత్తోర్‌ఘర్‌లోని సైనిక్ స్కూల్‌లో చేరారు. సైనిక్ స్కూల్ నుంచి పట్టభద్రుడయిన తర్వాత జైపూర్‌లోని మహారాజా కళాశాలల బీఎస్సీ (ఆనర్స్) ఫిజిక్స్ కోర్సులో చేరారు. ఆయనను ఆసక్తి కలిగిన పాఠకుడిగా, క్రీడాభిమానిగా పిలుస్తారు. రాజస్థాన్ ఒలింపిక్ అసోసియేషన్, రాజస్థాన్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఇదిలా ఉండగా మాజీ ఉపరాష్ట్రపతిగా వెంకయ్య నాయుడుకు కేటాయించిన 1, త్యాగరాజ్ మార్గ్ నివాసం ఇంకా సిద్ధంగా లేనందున నాయుడు గురువారం హైదరాబాద్‌కు వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు.

ఉపరాష్ట్రపతి నివాస్‌కు చేరుకున్న ధన్కర్

భారతదేశ 14వ ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేసిన జగదీప్ ధన్కర్ గురువారం తన అధికారిక నివాసమైన ఉపరాష్ట్రపతి నివాస్‌కు చేరుకున్నారు. ఆయన వెంట ఆయన సతీమణి సుదేష్ ధన్కర్, ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారు. అనంతరం రాజ్యసభ సచివాలయానికి వెళ్లి అధికారులతో సమావేశమవుతారు.

రాజస్థాన్ వ్యాపారుల ఇళ్లల్లో నోట్ల గుట్టలు

- ఐటీ అధికారుల సోదాల్లో రూ.150 కోట్ల నల్లధనం లభ్యం
- మహారాష్ట్రలో రూ.56 కోట్ల నగదు.. రూ.14 కోట్ల ఆభరణాలు సీజ్

న్యూఢిల్లీ: జాతిరత్నాలు, ఆభరణాలు, ఆతిథ్యం (హాస్పిటాలిటీ), రియల్ ఎస్టేట్ వంటి వ్యాపారాలతో సంబంధం ఉన్న జైపూర్‌కు చెందిన గ్రూపు ఆస్తులను ఐటీ అధికారులు సోదా చేయగా రూ.150 కోట్లకుపైగా అక్రమ సొమ్ము లభ్యమైనట్లు సీబీడీటీ గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. అలాగే, మహారాష్ట్రలో స్టీల్ టీఎంటీ బార్ల తయారీకి సంబంధించి రెండు ప్రధాన వాణిజ్య సముదాయాల ఆస్తులను తనిఖీ చేసి రూ.56 కోట్ల నగదు, రూ.14 కోట్ల విలువ చేసే ఆభరణాలను ఆదాయపు పన్ను శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. నగదు, ఆభరణాలు మొత్తం కో-ఆపరేటివ్ బ్యాంకులకు సంబంధించి 30కుపైగా ఖాతాల్లో, ఫామ్‌హౌస్‌లోని రహస్య చాంబర్‌లో ఉంచినట్లు ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ) వెల్లడించింది. ఈనెల 3న జల్నా, ఔరంగాబాద్, నాసిక్, ముంబైలో 30కుపైగా ప్రాంగణాల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపింది. ఈ రెండు వ్యవస్థలు జీఎస్టీ మోసాలకు పాల్పడినట్లు పేర్కొంది. ముడి పదర్థాల మితిమీరిన నిల్వలను గుర్తించారని, రూ.120 కోట్లకుపైగా లావాదేవీల వివరాలు పొందుపర్చలేదని ప్రకటన తెలిపింది. బూటకపు రుణాలు, కోల్‌కతాకు చెందిన డొల్ల కంపెనీల ద్వారా అక్రమ డబ్బును ఆర్జించినట్ల ఆధారాలు లభ్యమైనట్లు సీబీడీటీ వెల్లడించింది. రెండు సముదాయాలకు సంబంధించి భారీ సంఖ్యలో లాకర్లు ఉన్నాయని, కంపెనీల ఉద్యోగుల పేరిట అవి కోఆపరేటివ్ బ్యాంకులో ఉన్నట్లు తెలిపింది. మరోవైపు రాజస్థాన్‌కు చెందిన వాణిజ్య సముదాయానికి చెందిన పదుల సంఖ్యలో ఉన్న ఆస్తును సోదా చేయగా రూ.150 కోట్లకుపైగా నగదు లభ్యమైనట్లు తెలిపింది. రూ.11 కోట్లకుపైగా విలువచేసే ఆస్తులను సీజ్ చేసినట్లు బోర్డు తెలిపింది. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా భారీగా పన్నును ఎగవేశారని పేర్కొంది. ఇల్లు, భూముల లెక్కలను రెగ్యులర్ పుస్తకాల్లో నమోదు చేయలేదని తెలిపింది. ఆభరణాలు, రత్నాలు కూడా అక్రమంగా విక్రయించారని, అందుకు సంబంధించి ఆధారాలు లభించాయని వెల్లడించింది. అక్రమ సంపాదన మొత్తం భూములు, విలాసవంత హోటల్ నిర్మాణంపై వెచ్చించారని, నగదు రుణాలకూ వినియోగమవుతున్నట్లు తెలిసిందని పేర్కొంది. ఈ రుణాలపై వడ్డీ ఆదాయం గురించి వివరాలు సోదాల్లో లభ్యమైనట్లు సీబీడీటీ ప్రకటన తెలిపింది. రూ.150 కోట్ల అక్రమ ఆదాయ సృష్టిలో ఈ గ్రూపు నిమగ్నమైనట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు వెల్లడించింది.

యమునలో పడవ మునక

- నలుగురి మృతి
- సీఎం యోగి దిగ్భ్రాంతి

బందా: ఉత్తరప్రదేశ్ బందా జిల్లాలో యమునా నదిలో ఓ పడవ ప్రమాదానికి గురైంది. మార్కా నుంచి ఫతేహ్‌పూర్ జిల్లాలోని జరౌలీ ఘాట్‌కు వెళ్లే క్రమంలో పడవ ప్రమాదం గురువారం చోటుచేసుకుంది. నలుగురి మృతదేహాలు లభ్యం కాగా మిగతా ప్రయాణికుల కోసం గాలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు పడవలో 30-35 మంది ప్రయాణికులు ఉన్నట్లు ఎస్పీ అభినందన్ అన్నారు. గల్లంతైన వారి కోసం గజ ఈతగాళ్ల సాయంతో గాలిస్తున్నట్లు చెప్పారు. ఏడెనిమిది మంది ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారని అదనపు ఎస్పీ లక్ష్మి నివాస్ మిశ్రా తెలిపారు. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను దగ్గరుండి సమీక్షించాలని జిల్లా సీనియర్ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించాలని సూచించారు. గాయపడిన వారికి ఉత్తమ వైద్యం అందేలా చూడాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

ప్రధాని పదవి ఔన్నత్యాన్ని దిగజార్చొద్దు..

మోదీ చేతబడి వ్యాఖ్యలపై రాహుల్ విమర్శ



న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేతలు చేతబడి చేస్తున్నారన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలను ఆ పార్టీ ఖండించింది. 'జుమ్లాజీవి (ప్రధానిని ఉద్దేశించి) నోటికొచ్చినట్లు మాట్లాడతారు. దేశం, ప్రజా సమస్యలపై నోరు మెదపరు' అని కాంగ్రెస్ ఘాటుగా విమర్శించింది. మోదీ తన పదవి హూందాతనాన్ని మర్చి మాట్లాడుతున్నారని, ప్రధానిగా ఔన్నత్యాన్ని దిగజారుస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. ఇలాంటివి మానుకోవాలని ఆయనకు హితవు పలుకుతూ హిందీలో ట్వీట్ చేశారు. ప్రజా సమస్యలపై సమాధానాలు ఇవ్వాల్సిందేనని ప్రధానికి రాహుల్ తేల్చిచెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కూడా స్పందించారు. 'నల్లవస్త్రాలు ధరించిన వారు ఎప్పటికీ ప్రజల విశ్వాసాన్ని పొందలేరని ప్రధాని అన్నారు. ఈవీఆర్ పెరియార్ తన జీవితంలో నల్లచొక్కానే ధరించారు. తమిళ ప్రజలు ఆయనను అమితంగా ఆదరించారు. (సనాతన ధర్మను నమ్మే వారు తప్ప)' అని చిదంబరం ట్వీట్ చేశారు.

గోరంట్లపై చర్యలు తీసుకోండి

లోక్‌సభ స్పీకర్‌కు ఎన్‌సీడబ్ల్యూ వినతి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హిందూపూర్ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా చర్యలు తీసుకోవాలని జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) కోరింది. ఆయనపై తమకు లైంగిక వేధింపుల ఫిర్యాదు అందినట్లు తెలిపింది. బాధితుల సమ్మతి లేకుండా నిందిత ఎంపీ నగ్నంగా వీడియో కాల్ చేసినట్లుగా ఫిర్యాదులో ఉన్నట్లు ప్యానల్ వెల్లడించింది. అది అశ్లీల వీడియో అని ఎన్‌సీడబ్ల్యూ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆరోపణల తీవ్రత దృష్ట్యా ఓం బిర్లా చర్యలను కోరుతూ లేఖ రాసినట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ డైజీపీకీ ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ రేఖా శర్మ లేఖ పంపారు. ఎంపీ అశ్లీల వీడియోపై స్వతంత్ర విచారణ చేపట్టాలని కోరింది.

కేఐఐఎఫ్‌బీపై ఈడీ విచారణ సరికాదు

- ఐదుగురు ఎల్‌డీఎఫ్ ఎమ్మెల్యేల వ్యాజ్యం
- ఉత్తర్వులు రిజర్వు చేసిన కేరళ హైకోర్టు

కొచ్చి: కేఐఐఎఫ్‌బీకి చెందిన ఆర్థిక లావాదేవీల్లో ఉల్లంఘనల ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు వ్యతిరేకంగా ఐదుగురు ఎల్‌డీఎఫ్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన ఉమ్మడి వ్యాజ్యం పై కేరళ హైకోర్టు గురువారం ఉత్తర్వులను రిజర్వు చేసింది. రెండు పక్షాల వాదనలు విన్న తర్వాత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.మణికుమార్, జస్టిస్ షాజీ పి చాలీలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపింది. సీపీఎం ఎమ్మెల్యేలు కె.కె.శైలజ, ఐబీ సతీష్, నటుడు ఎం.ముఖేష్, సీపీఐ ఎమ్మెల్యే ఇ.చంద్రశేఖరన్, కాంగ్రెస్ (సెక్యులర్) ఎమ్మెల్యే కదన్నపల్లి రామచంద్రన్ ఈడీ విచారణను వ్యతిరేకిస్తూ హైకోర్టులో ఉమ్మడిగా పిటిషన్ వేశారు. ఈ వ్యవహారంలో ఎమ్మెల్యేల తరపున వాదిస్తున్న న్యాయవాది వి.ఎం.కృష్ణకుమార్‌తో పాటు రాష్ట్రం తరపున హాజరయిన సీనియర్ ప్రభుత్వ న్యాయవాది మనుపీ కూడా హైకోర్టు తీర్పును రిజర్వులో ఉంచినట్లు ధ్రువీకరించారు. కేరళ మౌలిక సదుపాయాల పెట్టుబడి నిధి బోర్డు (కేఐఐఎఫ్‌బీ)ని అప్రతిష్ఠపాలు చేసేందుకు ఈడీ కసరత్తు చేస్తోందని, దాని ఫలితంగా దాని వివిధ పెట్టుబడిదారులను భయపెట్టిందని ఎమ్మెల్యేలు పిటిషన్‌లో ఆరోపించారు.

రైఫిల్ షూటింగ్‌లో
భువితకు 3 గోల్డ్ మెడల్స్

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన 22వ రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థిని తుమ్మల భువిత విశేష ప్రతిభ కనబరిచింది. సీనియర్, జూనియర్, యూత్ కేటగిరీల్లో జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని 3 బంగారు పతకాలను దక్కించుకుంది. యూనివర్సిటీ ప్రాంగణంలో గురువారం వివరాలను యాజమాన్యం వెల్లడించింది. ఈ నెల 4 నుంచి 7 వరకూ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో పాల్గొన్న భువిత వరుసగా మూడు గోల్డ్‌మెల్స్ కైవసం చేసుకుంది. గతంలో రాష్ట్ర, జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొన్న భువిత రెండు సార్లు గోల్డ్‌మెడల్ దక్కించుకుంది.

విజయవాడలోని ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ కోచ్ సుబ్రహ్మణ్యేశ్వరరావు దగ్గర భువిత షూటింగ్ మెళకువలు నేర్చుకున్నట్లు ఆమె తండ్రి తుమ్మల జగదీష్ పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో వరుసగా మూడు గోల్డ్‌మెడల్స్ సొంతం చేసుకున్న భువిత ప్రతిభను యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పీ సత్యనారాయణన్, వైస్ ఛాన్సలర్ ఆచార్య వజ్జా సాంబశివరావు, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ కుమార్ ప్రశంసించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు.

వసూళ్లు చూసి సంబరాలు చేసుకోకూడదు: తమ్మారెడ్డి భరద్వాజ

హైదరాబాద్: 'బింబిసార', 'సీతా రామం' హిట్ అయ్యాయని ఆనందపడిపోకూడదు. భవిష్యత్తులో తెరకెక్కించే ప్రతి చిత్రాన్ని మంచి కంటెంట్‌తో రూపొందించాలి. మూడు, నాలుగు రోజుల కలెక్షన్స్ చూసి సంబరాలు చేసుకోకూడదు' అని ప్రముఖ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. 'బింబిసార'ను వీక్షించిన ఆయన సినిమా గురించి తన అభిప్రాయాలు పంచుకుంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'బింబిసార' రెగ్యులర్ కమర్షియల్ కథేనని.. కొత్త కథేమీ కాదని చెప్పారు. అయితే దర్శకుడు వశిష్ఠ ఈ సినిమాను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారని మెచ్చుకున్నారు. 'బింబిసార' అనే క్రూరమైన రాజుతో కథ మొదలుపెట్టి టైమ్ ట్రావెల్‌లో ఆ రాజు ఎలా సెంటిమెంటల్‌గా మారాడో చూపించారు అని తమ్మారెడ్డి విశ్లేషించారు.

ఉచితాలు, సంక్షేమం వేరు: సుప్రీం

న్యూఢిల్లీ: ఉచితాలు, సంక్షేమ పథకాలు వేర్వేరు అని సుప్రీంకోర్టు గురువారం పేర్కొంది. ఆర్థిక వ్యవస్థ దీని వల్ల డబ్బును కోల్పోతోందని, దీంతో ప్రజల సంక్షేమం సమతుల్యంగా ఉండాలని సూచించింది. తమ విజన్‌లను, ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు ఒకరు ఉండాలి.. నా పదవీ విమరణకు ముందు ఏదో ఒకటి చెప్పండి అని సీజేఐ ఎన్వీ రమణ అన్నారు. ఇందుకోసం 17వ తేదీ వరకు గడువు ఇచ్చారు. తదుపరి విచారణ అదే రోజుకు వాయిదా వేశారు. ఎన్నికల సంఘం అఫిడవిట్ వార్తాపత్రికల్లో దర్శనం ఇవ్వడంపైనా సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తంచేసింది. ఇకపై వార్తాపత్రికలకే అఫిడవిట్లు ఇవ్వండి అంటూ చీవాట్లు పెట్టింది. ఎన్నికల వేళ విచక్షణారహితంగా ఉచితాలను ప్రకటిస్తూ అప్రజాస్వామికంగా వ్యవహరించే రాజకీయ పార్టీల గుర్తింపు రద్దు చేయాలన్న పిటిషన్‌ను సీజేఐ ఎన్వీ రమణ, జస్టిస్ కృష్ణమురారీ ధర్మాసనం తాజా విచారించింది. 'రాజకీయ పార్టీల గుర్తింపు రద్దు చేసే వ్యవహారంలో జోక్యం చేసుకోబోమని చెప్పింది. ఇది అప్రజాస్వామిక ఆలోచన. మనది ప్రజాస్వామిక విధానమని సీజేఐ రమణ అన్నారు. ఈ అంశంలో శాసనపరమైన శూన్యత నెలకొన్నాగానీ జోక్యం చేసుకోనన్నారు. ఈ నిర్ణయానికిగాను తనను మౌఢ్యునిగా, చాందసవాదిగా అనుకున్నా పర్వాలేదన్నారు. సీనియర్ న్యాయవాదులు తమ పక్షాన్ని ఉంచారు, ఇక మిగతా పార్టీలు కూడా తగు సూచనలను నా పదవీ విమరణకు ముందే చేస్తే బాగుంటుంది అని సీజేఐ రమణ అన్నారు.

'ఇది తీవ్రమైన అంశమని, ఉచితాలను కోరుకునే వారికి అవి లభిస్తున్నాయని, మనది సంక్షేమ వ్యవస్థ అని, పన్నులు చెల్లిస్తున్నామని కొందరు చెప్పవచ్చుగానీ అవి అభివృద్ధికి వినియోగమవుతున్నాయి. కాబట్టి కమిటీ రెండు పక్షాలను వినాలి' అని ధర్మాసనం చెప్పిందని పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ అన్నారు. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరయ్యారు. సమాజానికి సంక్షేమ చర్యలకు ఉచితాల పంపిణీ ఒక్కటే మార్గమని కొన్ని రాజకీయ పార్టీలు భావిస్తుండటం దురదృష్టకరం. ఇది అశాస్త్రీయం.. ఆర్థిక వినాశానికి దారితీస్తుంది' అని అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా చేసే కంపెనీలలో చాలా పీఎస్‌యూలు అని, అవన్నీ ఆర్థిక ఒత్తిళ్లకు లోనవుతున్నాయని చెప్పారు. శాసనపరమైన లేక ఎన్నికల సంఘం తగు చర్యలను తీసుకోనంత వరకు రాజకీయ పార్టీలకు తగు మార్గదర్శకాలను సర్వోన్నత న్యాయస్థానం చేయాలని కోరారు. దీంతో ఎన్నికల సంఘం అదనపు అఫిడవిట్‌ను వార్తా పత్రికల్లో ప్రచురించడాన్ని సీజేఐ రమణ ప్రస్తావించారు. జడ్జీల కంటే ముందు మీడియాకు అది చేరిందని అన్నారు. ఎన్నికల కమిషన్ కౌంటర్ అఫిడవిట్‌లను వార్తా పత్రికల్లో చదువుకోవాల్సి వస్తోంది. గతరాత్రి వరకు మాకు అది అందలేదు. ఇకపై వార్తాపత్రికలకే అఫిడవిట్లు ఇవ్వండి అని ఎన్నికల సంఘానికి న్యాయస్థానం మొట్టికాయలు వేసింది. అఫిడవిట్‌ను ఆఫ్‌లైన్‌లో దాఖలు చేయగా ప్రతులను ఇతర పక్షాలకూ పంపినట్లు ఎన్నికల సంఘం తరపున సీనియర్ న్యాయవాది మనీందర్ సింగ్ తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ 'మాకు చేరకుండానే వార్తాపత్రికలకు అది ఎలా చేరింది? ఇక ఎన్నికల కమిషన్ అఫిడవిట్‌లో పరిశీలించేందుకు ఏముంది? అంటూ అసహనం వ్యక్తం చేసింది. కాగా, ఈనెల 10న అదనపు అఫిడవిట్‌ను ఎన్నికల సంఘం దాఖలు చేసింది. ఉచితాలపై సమీక్షకు నిపుణుల ప్యానల్ ఏర్పాటు సూచనను స్వాగతిస్తున్నట్లు పేర్కొంది. తమది రాజ్యాంగబద్ధ యంత్రాంగం కాబట్టి ఈ అంశంతో తమకు ముడిపెట్టవద్దని న్యాయస్థానాన్ని కోరింది.

బీమా పరిహారం పొందేందుకు
వివాహిత కుమార్తెలూ అర్హులే...

కర్ణాటక హైకోర్టు

బెంగళూరు: ప్రమాదాల్లో తమ తల్లిదండ్రులను కోల్పోయిన వివాహిత కుమార్తెలు సైతం బీమా పరిహారం పొందేందుకు అర్హులే అని కర్ణాటక హైకోర్టు పేర్కొంది. ఇటువంటి కేసుల్లో సుప్రీంకోర్టు కూడా ఇదే తీర్పునిచ్చినట్లు తెలిపింది. పెళ్లి అయిన కుమారులు లేదా కుమార్తెల మధ్య కోర్టు వివక్ష చూపబోదని, పెళ్లి అయింది కాబట్టి పరిహారం పొందేందుకు కుమార్తెలు అర్హులు కాదన్నది ఆమోదయోగ్యం కాదని హైకోర్టు ఏకపక్ష ధర్మాసనం పేర్కొంది. ఓ బీమా కంపెనీ వేసిన పిటిషన్‌ను జస్టిస్ హెచ్‌పీ సందేశ్ గురువారం విచారించారు. 2012, ఏప్రిల్ 12న ఉత్తర కర్ణాట కలోని హుబ్బాళీలో యమనూర్ సమీపంలో జరిగిన ప్రమాదంలో రేణుక (57) చనిపోయారు. ఆమెకున్న వివాహిత కుమార్తెలు బీమా మొత్తం కోరడంతో బీమా కంపెనీ కోర్టును ఆశ్రయించింది. రేణుకకు భర్త, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారంతా పరిహారం ఇవ్వాలన్నారు. ఆరుశాతం వార్షిక వడ్డీతో రూ.5,91,600ను కుటుంబ సభ్యులకు పరిహారంగా మోటర్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ అందించింది. మృతురాలిపై ఆధార పడటం లేనందున వివాహిత కుమార్తెలు పరిహారాన్ని కోరలేరని బీమా కంపెనీ వాదించింది. కుటుంబ పెద్దను కోల్పోయినట్లుగా బీమా మొత్తాన్ని ఇవ్వడం తగదని, 'లాస్ ఆఫ్ ఎస్టేట్' కింద మాత్రమే పరిహారం ఇవ్వాలని పేర్కొంది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ 'డిపెండెన్సీ (ఆధారం) అంటే ఆర్థికపర మైనది మాత్రమే కాదు' అని సేవ, భౌతికంగా, మానసికంగానూ ఉంటుందని తెలిపింది. మృతురాలి వయస్సు, ఆదాయంపై కంపెనీ సందేహాలనూ కోర్టు కొట్టివేసింది. మృతురాలు కొనుగోలు చేసిన కుట్టుమిషన్‌కు సంబంధించి వారంటీ కార్డు ఆధారంగా ఆమె నెలసరి ఆదాయం రూ.4,500గా ట్రిబ్యునల్ గుర్తించింది. అయితే ట్రిబ్యునల్ చాలా ఎక్కువ మొత్తాన్ని పరిహారంగా ఇచ్చిందన్న బీమా కంపెనీ వాదనను ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.